

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0
కనిష్ఠం : 26.0



స్మార్ట్‌సిటీపై ఆశలు!

- వైసీపీ ప్రభుత్వ హయాంలో పనుల నిలిపివేత
- టీడీపీ అధికారంలోకి రావడంతో కదలిక వస్తుందని నగరవాసుల్లో ఆశాభావం

ఏలూరు నగరం స్మార్ట్‌సిటీగా మారుతుంది.. తమ జీవనప్రమాణాలు మెరుగవుతాయి.. ఆర్థికంగా అభివృద్ధి చెందుతాం.. తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని నగర ప్రజలు ఎంతగానో ఆశపడ్డారు. ఆ ఆశలను గత వైసీపీ ప్రభుత్వం అడియాశలు చేసింది. మరల టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్మార్ట్‌సిటీపై స్థానికులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

(ఏలూరు టూటౌన్- ఆంధ్రజ్యోతి)

గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో 2017 ఫిబ్రవరి 8న ఏలూరును స్మార్ట్‌సిటీగా నిర్మిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ కనపరిచి స్మార్ట్‌సిటీగా ఎంపిక చేశారు. రాష్ట్రంలో ఆరు నగరాలను స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేసినా ఏలూరు నగరాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టారు. అనాటి ఎమ్మెల్యే, దివంగత కోటరామారావు కృషి చేసి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చారు.

ఈ ప్రాజెక్టును సీమెన్స్ కన్సారియంకు ప్రభుత్వం అప్పగించింది. దాని భాగస్వామి అయిన షాపూర్‌జీ పల్లోంజి కంపెనీ ఏలూరు నగరంలో పర్యటించి స్మార్ట్‌సిటీగా తయారవ్వా లంటే నగరం ఏఏ అంశాల్లో మెరుగవ్వాలి, దానికి ఎంత ఖర్చవుతుందని సర్వే నిర్వహించారు.

స్మార్ట్‌సిటీ నిర్మాణానికి రూ.896.85 కోట్లు ఖర్చవుతాయని అనంతరం పదేళ్ల మెయిటినెన్స్ ఖర్చులు రూ.346.02 కోట్లు ఖర్చవుతాయని మొత్తంగా 1242.87 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు తయారు చేశారు. ఈ ప్రతిపాదనలు ఆమోదించి స్విస్ ఛాలెంజ్ పద్ధతిపై పనులు ప్రారంభించి, రెండేళ్లలో స్మార్ట్ సిటీ పనులు పూర్తి చేయాలని షాపూర్‌జీ పల్లోంజి సంస్థను ప్రభుత్వం ఆదేశించింది. అనంతరం 2019లో అనాటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.5.86 కోట్లు తమ వాటాగా విడుదల చేసింది. ఈ సొమ్ములో రూ.రెండు కోట్లను ఖర్చు చేసి నగరంలో కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. ఈలోగా ఈ ఎలక్షన్ కోడ్ వచ్చింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారి వైసీపీ అధికారం చేపట్టింది.

స్మార్ట్‌సిటీని నిర్మిస్తే టీడీపీ ప్రభుత్వానికి ఎక్కడ పేరువస్తుందోనన్న ఆలోచనతో రివర్స్ టెండరింగ్ పేరుతో షాపూర్‌జీ పల్లోంజి సంస్థ కాంట్రాక్టును నిలుపుదల చేసింది. దీంతో స్మార్ట్‌సిటీపై నగరప్రజలు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. మరలా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నగరప్రజల్లో స్మార్ట్‌సిటీపై ఆశలు రేకెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాను ప్రారంభించిన స్మార్ట్‌సిటీ పనులను తిరిగి ప్రారంభిస్తారని ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

స్మార్ట్‌సిటీ అంటే..

స్మార్ట్‌సిటీ అంటే ప్రజల జీవన ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం. ప్రజలు ఆరోగ్యవంతమైన జీవనం గడపడానికి, ఆయుఃప్రమాణాలు పెంచేలా పరిసరాల పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకుంటారు. నగరం అంటే చెత్తతో కూడుకుని ఉంటుంది. స్మార్ట్‌సిటీలో ఇలాంటి చెత్తా ఎక్కడా కనపడకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. స్మార్ట్‌సిటీలో ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్‌రంగాలు పూర్తిగా అభివృద్ధి చెంది ఉంటుంది తనదైనందిక కార్యక్రమాలన్నిటిని టెక్నాలజీ ద్వారా వినియోగించుకుంటారు. నగరంలో పరిశ్రమలు ఏర్పడతాయి. ప్రజల జీవనప్రమాణం పెరిగి ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

అభివృద్ధి పనుల అంచనాలు..

స్మార్ట్‌సిటీ రోడ్ల అభివృద్ధికి రూ.49 కోట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ మెరుగుదలకు రూ.9.85 కోట్లు, ఎలక్ట్రీఫికేషన్ కోసం అండర్‌గ్రౌండ్‌లో కేబుల్స్ వేయడానికి రూ.221.55 కోట్లు, 24 గంటలు నీటి సరఫరా కోసం రూ.15.49 కోట్లు, వ్యర్థపదార్థాల నిర్వహణ కోసం రూ.207 కోట్లు, డ్రెయినేజీల అభివృద్ధి కోసం రూ.90.86 కోట్లు, సెప్టిక్‌ట్యాంకుల నిర్మాణం కోసం రూ.71.35 కోట్లు ఖర్చవుతాయని అంచనాలు వేశారు. ఈ ప్రాజెక్టుకు ఏలూరు స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్ (ఈఎస్‌సీసీఎల్) పేరు నామకరణం చేసి కలెక్టర్‌ను చైర్మన్‌గా, ఐదుగురిని సభ్యులుగా నియమించారు. ఎస్పీ, నగర కమిషనర్‌లతో పాటు, ఒక ఇద్దరు నిపుణులైన అధికారులను ఈ కమిటీలో నామినేట్ చేశారు. ఈ కంపెనీకి టెక్నికల్ కన్సల్‌టెంట్‌గా అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రెక్చర్ అసెట్ మేనేజ్మెంట్‌ను ప్రభుత్వం నామినేట్ చేసింది. ఆర్థిక లావాదేవీల కన్సల్‌టెంట్‌గా అనాటి ఆంధ్రాబ్యాంకును ఎంపిక చేశారు.



కోటదిబ్బ కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఏపీఆర్జేసీ పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వివిధ తరగతుల్లో ప్రవేశాలకు శుక్రవారం ఏలూరులోని ఆరు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ప్రవేశపరీక్ష(ఏపీఆర్ఎస్ క్యాట్)కు 1237మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 987 మంది హాజరయ్యారని వివరించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీఆర్‌జేసీ పరీక్షకు 1520మంది దరఖాస్తుచేసుకోగా 1305మంది, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన డీసీ సెట్ పరీక్షకు 44మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 38మంది హాజరయ్యారని తెలిపారు. వివిధ పరీక్ష కేంద్రాలను కాకినాడ ఆర్జేడీ నాగమణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ, పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్ ప్రవీణ, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ సందర్శించారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

మలేరియా నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని ప్రభుత్వాసుపత్రులు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తారని, అనుమానిత లక్షణాలున్న వారందరూ సమీపంలోని ప్రభుత్వాసుపత్రులకు వెళ్లాలని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని సూచించారు. ప్రపంచ మలేరియా వ్యతిరేక దినం సందర్భంగా శుక్రవారం ఏలూరులో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీ ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తీవ్రమైన జ్వరం, చలి, వణుకు, చెమటలు పట్టడం తదితర లక్షణాలు మలేరియా జ్వరం కావొచ్చని, అశ్రద్ధ చేయకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్‌డబ్ల్యూసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రోహిత్, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, డీపీహెచ్‌ఎన్‌వో డాక్టర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ జూలై 5కు వాయిదా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మే 10వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5వ తేదీకి వాయిదా పడిందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్న ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 10వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో రెండవ జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించాల్సి ఉందన్నారు. దీనిని జూలై 5 నిర్వహించనున్నట్టు తెలిపారు. కక్షిదారులు గమనించాలని సూచించారు.

నేడు జిల్లా కోర్టులో వర్క్‌షాపు

ఏలూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈనెల 26వ తేదీన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయాధికారులకు ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు జడ్జిలు జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ హాజరు కానున్నారు. జస్టిస్ మన్మథరావు ఉదయం 9 గంటలకు, జస్టిస్ డాక్టర్ కృపాసాగర్ ఉదయం 9.30 గంటలకు ఏలూరు రెవెన్యూ గెస్ట్‌హౌస్‌కు చేరుకోనున్నారు. అనంతరం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించే వర్క్‌షాపునకు హాజరుకానున్నారు.

ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు సహకరించాలి : కలెక్టర్



ఏలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులతో శుక్ర వారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నిరంతం జరుగు తుందని, జిల్లాలో మొత్తం 16లక్షల38వేల246 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జాబితాలో సవరణకు ఫారం-6 కింద 1,429 అందగా 1,055 పరిష్కరించామని, నిబంధ నలు లేని 288 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. ఫారం-7 కింద 1,724 దరఖాస్తులు రాగా 986 పరిష్కరిం చామని, 640 దరఖాస్తులు తిరస్కరించామన్నారు. ఫారం- 8 కింద 7,852 రాగా 7,374 పరిష్కరించి, 241 దరఖాస్తు లను తిరస్కరించామన్నారు. ఓటర్ల జాబితాలు పక్కాగా నిర్వహించేందుకు సూచనలు, సలహాలను స్వీకరిస్తున్నామన్నారు. డీఆర్వో విశ్వేశ్వరారవు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

3,600

- జిల్లాకు కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లు
- ఇప్పటి వరకు జిల్లాలో 68,200
- కొత్తవి కలిస్తే మొత్తం 71,800
- మే నుంచి పంపిణీకి ఏర్పాట్లు



ఏలూరు సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్ల నుంచో ఎదురుచూస్తున్న పింఛన్ దారులకు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఊరట లభించింది. జిల్లాకు సంబంధించి కొత్తగా 3,600 వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. వీటిని మే నుంచి లబ్ధిదారులకు అందించనున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారితో పాటు డిసెంబరు నుంచి పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే భార్యకు ఆ పింఛన్‌ను మంజూరు చేయడం వల్ల వితంతు పింఛన్లు జిల్లాకు అధికంగా మంజూరైయ్యాయి. 2023, డిసెంబరు నుంచి 2024 అక్టోబరు వరకు దాదాపు 10 నెలల పాటు వితంతు పింఛన్ దరఖాస్తులను పరిశీలించి కొత్తవాటిని మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులై ఉండి వితంతు పింఛన్ రాని లబ్ధిదారులకు మంజూరు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్నా కొంత మందికి పింఛన్లు తొలగించారు. అటువంటి వారికి కూడా మంజూరు చేయాలని బాధిత లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.మరోవైపు జిల్లాలో పీజీఆర్ఎస్‌లో ఇప్పటికీ కొత్త పింఛన్ల కోసం అర్హులైన లబ్దిదారులు దరఖాస్తులు చేస్తూనే ఉన్నారు. కొత్తవి మంజూరు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేయాల్సి ఉంది.

వితంతు పింఛన్లు 71,800

జిల్లాలో ఇప్పటివరకు వితంతు పింఛన్ లబ్ధిదారులు 68,200 మంది వరకు ఉన్నారు. ఇప్పుడు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మరో 3,600 మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో ఈ సంఖ్య 71,800 వరకు పెరిగింది. కొత్తగా మంజూరు చేసిన వితంతు పింఛన్లు మేనెల నుంచి పంపిణీ చేస్తారు. దీనికి సంబంధించి జాబితాలను మండలాలకు పంపించనున్నారు. కాగా జిల్లాకు కొత్తగా వితంతు పింఛన్‌లు మంజూరు చేయడం వల్ల ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది. ఒక్కొక్క పింఛన్ నాలుగు వేలు కాగా 3,600 పింఛన్‌లకు సంబంధించి కోటి 44 లక్షల రూపాయల వరకు భారం పడుతుందని అంచనా వేశారు.

నిబంధనల్లో మార్పులు

ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వితంతు పింఛన్ పథకం నిబంధనలలో మార్పులు చేసింది. గతంలో భర్త మరణిస్తే భార్య వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేయాల్సి వచ్చేది. పరిశీలనల మీద పరిశీలనలు జరిపి అన్ని అర్హతలు ఉన్నా మంజూరు అవుతుందో లేదో తెలియని పరిస్థితి ఉండేది. వలంటీర్ల వ్యవస్థ ద్వారానే గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు మంజూరు చేసేవారు. దీంతో ప్రజా ప్రతినిధులు చెబితేనే మంజూరు చేసిన సందర్భాలు ఉన్నాయి. రాష్ట్రంలో ఏర్పడిన టీడీపీ ప్రభుత్వం వితంతు పింఛన్‌ల నిబంధనలలో మార్పులు చేసింది. భర్త మరణిస్తే భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఎటువంటి దరఖాస్తు లేకుండానే మంజూరు చేయాలని నిర్ణయించింది. గతంలో మాదిరిగా పింఛన్ రావడానికి నిర్దిష్టమైన గడువు తేదీలను నిర్ణయించలేదు. ఇది పింఛన్‌దారులకు ఊరట నిచ్చే అంశం.



నిఘా నేత్రం!



జంగారెడ్డిగూడెంలో భారీగా సీసీ కెమెరాల ఏర్పాటు

- ఇకపై నేరాలకు పడనున్న అడ్డుకట్ట
- 44 హై క్వాలిటీ కెమెరాలు అందించిన నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గత కొద్ది నెలల క్రితం పట్టణంలోని ఓ కళాశాల సమీపంలో సచివాలయ ఉద్యోగిని రాత్రి సమయంలో తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై వచ్చి ఆ మహిళ మెడలో బంగారు గొలుసు లాక్కుని పారిపోయాడు. ఈ ఘటన జరిగిన కొద్దిరోజుల్లోనే పేరంపేట రోడ్డులో మరో మహిళ రాత్రిపూట వెళ్తుండగా ఆమె మెడలో గొలుసును ఓ వ్యక్తి తెంచుకుని పోయాడు. రామచంద్రాపురంలో ఓ ఆలయం పునఃప్రతిష్ఠ రోజున దర్శనానికి వచ్చిన ఐదుగురు మహిళల మెడల్లోని బంగారు సూత్రాలను తెంచుకు పోయారు. ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేక పోవడంతో నిందితులను పట్టుకోవడంలో పోలీసులకు సవాల్‌గా మారింది. పట్టణంలో నామమాత్రంగానే సీసీ కెమెరాలు ఉండడం, అందులో చాలా వరకు మరమ్మతులకు గురికావడంతో పోలీసులు దీనిపై దృష్టి సారించారు. పట్టణంలోని అన్ని ప్రధాన రహదారుల్లో దాతల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. స్థానిక నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యం దాదాపు రూ.37 లక్షల వ్యయంతో 44 అత్యాధునిక నైట్ విజన్ హై క్వాలిటీ సీసీ కెమెరాలను పోలీసులకు అందజేశారు. వీటిని పట్టణంలో ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో అన్ని ప్రాంతాలను పరిశీలించేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఇకపై పట్టణంలో చైన్‌స్నాచింగ్, నేరాలకు అడ్డుకట్ట పడుతుందని పోలీసులు భావిస్తున్నారు.



జంగారెడ్డిగూడెంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

కొత్తగా 44 సీసీ కెమెరాల ఏర్పాటు



నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ వారి సహకారంతో పట్టణంలో 44 అత్యాధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పాత కెమెరాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాం. చాలా కేసుల్లో నేరస్తులను పట్టుకోవడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. పట్టణంలో వ్యాపారస్తులు తమ దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించాం. సీసీ కెమెరాల బిగింపు పూర్తయిన తర్వాత ప్రారంభిస్తాం. ప్రస్తుతం కెమెరాల పనితీరును పరిశీలిస్తున్నాం.

- కె.కృష్ణబాబు, సీఐ, జంగారెడ్డిగూడెం

నేటి నుంచి జిల్లా అంతటా స్లాట్ రిజిస్ట్రేషన్లు

11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏర్పాట్లు పూర్తి

ఏలూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూములు, ప్లాట్‌లు రిజిస్ట్రేషన్లు సులభతరంగా చేసుకునేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానాన్ని జిల్లా అంతటా ఈ నెల 26వ తేదీ నుంచి అమలు చేయడానికి స్టాంపులు రిజిస్ట్రేషన్‌శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలుత ప్రయోగాత్మంగా ఈనెల 4న ఏలూరు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు చేసి సక్సెస్ అయ్యారు. ఆ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇక మిగిలిన 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలైన భీమడోలు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, పోలవరం, గణపవరం వట్లూరు, కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, నూజివీడుల్లోను శనివారం నుంచి అమలు చేయడానికి శ్రీకారం చుట్టారు. దీంతో రోజుకు పరిమితంగా నిర్దేశిత సమయాల్లో కక్షిదారులకు ఇబ్బందుల్లేకుండా స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు జరగనున్నాయి. దీనివల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందని జిల్లా రిజిస్ట్రార్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి వరకు ఏలూరు జిల్లా కార్యాలయం పరిధిలో 569 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లను స్లాట్ విధానంలో చేయడం ద్వారా రూ. ఐదు కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

సమగ్రశిక్షలో సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ఖాళీగా వున్న సెక్టోరల్, అసిస్టెంట్ సెక్టోరల్ ఆఫీసర్ పోస్టులకు ఆసక్తివున్న స్కూల్ అసిస్టెంట్లు/ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ కె.పంకజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలి పారు. ఒక ఏఎల్ఎస్‌వో, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్(సీఎంవో), అసిస్టెంట్ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ (ఉర్దూ), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా పోస్టులకు అర్హతలు, ఎంపిక విధానం, దరఖాస్తు నమూనా, తదితర వివరాల కోసం డీఈవోఏలూరు.ఓఆర్‌జీ లేదా ఏలూరు.ఏపీ.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్లను సందర్శించాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఏలూరు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు ఏపీసీ కార్యాలయంలో మే 2వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా అందజేయాలని కోరారు. వివరాలకు కార్యాలయ ఫోన్ నంబర్లు 92486 69171, 95333 99981లలో సంప్రదించాలన్నారు.



తాడువాయిలో ఏర్పాటు చేసిన వేరుశెనగ ఆయిల్ మిల్లు

యువతకు భరోసా

ఆహార శుద్ధి పరిశ్రమలతో ఉపాధి రెట్టింపు

- 280 యూనిట్లకు అనుమతి
- పీఎంఎఫ్‌ఎంఈలో అత్యధికంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీ
- పచ్చళ్లు, ఆహార ఉత్పత్తి పరిశ్రమల స్థాపనకు ఉపయుక్తం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి) : పరిశ్రమించే యువత, తాను ఏ రంగంలోనైనా రాణించాలనుకునే వారు ఆహారశుద్ధి పరిశ్రమలతో తమ కలలను సాకారం చేసుకోవచ్చు. దీనికి ప్రధానమంత్రి ఆహారశుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం (పీఎంఎఫ్ఎంఈ) భరోసా కల్పించనున్నది. నాలుగేళ్ల నుంచి ఈ పథకం అమలవుతుండగా, మరో సంవత్సరం 2025-26 వరకు దీనిని పొడిగించారు. ప్రధానంగా సంఘటిత రంగంలో ఉన్న చిన్నతరహా పరిశ్రమలకు గుర్తింపు కల్పించేందుకు ఈ పథకం మరింత దోహద పడనుంది. పెట్టుబడి సాయం బ్యాంకుల ద్వారా అందిస్తారు. మిషనరీ, షెడ్లు ఏర్పాట్లు యూనిట్ దారుడి ప్రణాళికకు అనుబంధంగా సహకారం అందిస్తారు. ఉదాహరణకు రూ.10 లక్షల యూనిట్ వ్యయం అయితే అందులో పది శాతం యూనిట్ దారుడు భరించాల్సి ఉంటుంది. మిగిలిన 90 శాతమైన రూ.9 లక్షలు బ్యాంకు లింకేజీ రుణాన్ని అధికారులు అందించే ఏర్పాట్లు చేస్తారు. 18 ఏళ్ల పైబడిన వారు దీనికి ఏ విద్యార్హత లేకపోయినా అర్హులే. రూ.లక్ష నుంచి కోటి వరకు రుణం పొందవచ్చు. ఇందులో 35 శాతం లేదా గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు సబ్సిడీను ప్రభుత్వం భరిస్తుంది. సక్రమంగా నిర్వహణ పూర్తిచేస్తే 35 శాతం సబ్సిడీ కింద అసలు మొత్తానికి బ్యాంకు ద్వారా యూనిట్ దారునికి జమ చేస్తారు. అంటే దాదాపుగా 55 శాతమే యూనిట్ దారుడు రుణం చెల్లించాల్సి ఉంటుంది.

- జిల్లాలో పచ్చళ్లు, హోమ్‌ఫుడ్, మామిడి తాండ్ర, బనాన పౌండర్, కొబ్బరినూనె, ఫిష్ పచ్చళ్లు, ఎండుచేపల డిహెడ్డింగ్, ఫిష్ ఉత్పత్తుల ప్యాకింగ్, పాలు, పెరుగు, నెయ్యి తయారీ, కోవా, పన్నీరు, ఐస్‌క్రీమ్ తదితర ఉత్పత్తుల యూనిట్లకు ఉపయుక్తం.
- జిల్లా మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో రిసోర్సుపర్సన్లు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారు. ప్రధా నంగా యూనిట్ల స్థాపన, రుణాల అందజేత, మిషనరీ ఏర్పాట్లు సహకారం అందిస్తారు. యూనిట్ల కొటేషన్ తయారీ, మంజూరు ప్రాసె సింగ్ వీరే చేస్తారు. ఔత్సాహికులు వీరిని సంప్రదించవచ్చు. ఏలూరుకు హిమవాణి సెల్ నంబరు- 94410 28109, జంగారెడ్డిగూడెంకు శ్రీనివాస్, 93925 90490, నూజివీడుకు ఆంజనేయులు, 94920 51509 నంబర్లలో పరిసర ప్రాంతాల వారు సంప్రదించవచ్చు.

అన్నివర్గాలకు ఉపయుక్తం



కష్టపడి ఉన్నతంగా ఎదగాలనే తపన, పరిశ్రమపై ఆసక్తి ఉన్న వారికి పీఎంఎఫ్ ఎంఈ ఉపయోగపడుతుంది. గోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు 273 యూనిట్లు గ్రౌండ్ అయ్యాయి. ఈ ఏడాది అదనంగా 280 యూనిట్ల మంజూరు ఇచ్చారు. ఇతర వివరాలకు ఈ పథకానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్.రామ్మోహన్‌రావును సంప్రదించవచ్చు.

- గోదావరి జిల్లాల జోనల్ మేనేజర్ (ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ) కేజే మారుతి

ఫోర్జరీ లీజు డాక్యుమెంట్లతో రుణాలు

- ముదినేపల్లి మండలంలో సీబీఐ అధికారుల విచారణ
- తమకు తెలియదంటున్న రైతులు
- జాతీయ బ్యాంక్‌కు తాడేపల్లిగూడెం వాసి టోకరా

లోపలి పేజీలో..

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వదోదర-390007.
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా - కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

ICICI బ్యాంక్ లిమిటెడ్ ("ICICI బ్యాంకో") నుండి వారిచే వినియోగించబడిన బంగారు ఆభరణాలపై రుణవసతి ("వసతి")గా పొందిన వారి బకాయి మొత్తములను చెల్లించవలసినదిగా దిగువ పేర్కొనబడిన రుణగ్రహీతలకు నోటీసులు జారీ చేయబడినవి. తమ బకాయిలను తిరిగి చెల్లించుటలో విఫలమైనందున, తప్పనిసరి పరిస్థితిలో మే 06, 2025న తనఖా చేయబడిన బంగారు ఆభరణములకు మేము ఇ-వేలము నిర్వహించుచున్నాము. ముందస్తు సమాచారం లేకుండా ఖాతాను తొలగించు / వేలము తేదీని మార్పు హక్కును ICICI బ్యాంక్ కలిగియున్నది. ఇ-వేలము ఆన్‌లైన్ ద్వారా మ.12.30 గం. నుండి మ.3.30 గం.ల మధ్య https://gold.samil.inలో నిర్వహించబడును. సవివర నియమ నిబంధనల కొరకు దిగువ ఇచ్చిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవ్వండి. ఒకవేళ రుణగ్రహీత మరణించినచో న్యాయవారసులకు అన్ని నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: బాపట్ల- ఆంధ్రప్రదేశ్	
358362005932	బోగిరెడ్డి వీరా రెడ్డి
శాఖ పేరు: చీరాల	
238662001319	దివ్వెల నాగబదరినాథ్
238662001624	దివ్వెల నాగబదరినాథ్
శాఖ పేరు:కాకినాడ	
028062008903	సూరాడ రాజేష్
శాఖ పేరు: కర్నూలు	
027957000518	ఎ చంద్రశేఖర్
శాఖ పేరు: మాచర్ల- ఆంధ్రప్రదేశ్	
377062003448	నందిపాటి వెంకట సుబ్బారెడ్డి

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
377062002489	రమావత్ భిక్షా నాయక్
శాఖ పేరు: ముండ్లపాడు	
307562000477	గొర్రెపాటి [illegible]
శాఖ పేరు: నంద్యాల [illegible]	
544557000032	[illegible]
శాఖ పేరు: నూజివీడు	
198262006113	నరగాని వెంకట రామయ్య
శాఖ పేరు: ఒబులవారిపల్లె	
204762000515	నాగిలి వెంకటేష్
శాఖ పేరు: పేరేరు	
375562003040	[illegible]
శాఖ పేరు: తెనుకు	
044062007328	శిర్ర శ్రీనివాస్
శాఖ పేరు: విజయవాడ-భవానీపురం	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
773962000308	ఏరువూరి నరసారెడ్డి
శాఖ పేరు: విశాఖపట్నం- సీతమ్మధార	
249457000124	[illegible]
శాఖ పేరు: లింగంపల్లి	
762162000418	[illegible]
శాఖ పేరు: సిద్దిపేట	
069157000082	దిక్కుడు నర్సింలు
శాఖ పేరు: శ్రీనగర్	
040762002178	ముద్దన్న శివ కుమార్
040762002182	ముద్దన్న శివ కుమార్

తేది : 26.04.2025
ప్రదేశం: అన్నమయ్య, బాపట్ల, కాకినాడ, కర్నూలు, నంద్యాల, ఎన్‌టిఆర్, పల్నాడు, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, ఏలూరు, మెదక్, ఆంధ్రప్రదేశ్

సం/- అధీకృత అధికారి,
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున



వైభవంగా వేంకటేశ్వర స్వామి రథోత్సవం

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గోవింద .. గోవింద .. అంటూ గోవింద నామ స్మరణతో శ్రీవారి రథోత్సవం వైభవంగా ముందుకు సాగింది. శుక్రవారం రాత్రి భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలోని వేంకటేశ్వర స్వామివారి 14వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, కమిటీ సభ్యులు రథోత్సవాన్ని ప్రారంభించారు. అర్చకులు శ్రీనివాస చార్యులు శ్రీవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఆలయం నుంచి కాలనీలోని ప్రధాన వీధుల్లో రథోత్సవం ముందుకు సాగింది. మందిర కార్యదర్శి కుక్కల బాల, రామారావు, జానపాటి మధు, పెన్నాడ శ్రీను, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యాటకులకు షాక్

వేసవిలో భూతల స్వర్గం కశ్మీర్ టూర్‌కు పలువురు ప్లాన్

ఉగ్రవాదుల నరమేథంతో భయం

మనాలి, సిమ్లా ప్రాంతాలకు మార్పు

నరసాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి)

నరసాపురంలో బులియన్ వ్యాపారం చేసే జైన్ కుటుంబాలు ఈ ఏడాది జనవరిలో కశ్మీర్ టూర్ వెళ్లారు. నాలుగు కుటుంబాలు పిల్లలతో కలిసి పది రోజుల పాటు ఎంజాయ్ చేశారు. అందమైన కశ్మీర్ సరస్సులో బోటు ప్రయాణంతో పాటు ప్రకృతి అందాలకు కేరాఫ్ అయిన పహల్గాం, గుల్‌మార్గ్, సోన్‌మార్గ్ వంటి ప్రాంతాల్లో పర్యటించారు. వీరియాత్ర గురించి తెలుసుకున్న మరికొన్ని కుటుంబాలు ఈ వేసవిలో వెళ్లేందుకు రెడీ అయ్యాయి. టిక్కెట్లు కూడా బుక్ చేసుకున్నారు. కశ్మీర్, జమ్ము ప్రాంతాల్లో ట్రావెల్ ఏజెంట్ ద్వారా రూమ్‌లు కూడా బుక్ చేశారు. అయితే ఇటీవల టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన నరమేథంతో ఒక్కసారి షాక్ తిన్నారు. కశ్మీర్ అందాలను చూడాలని ఆశపడ్డ వీరి కల ఒక్క సారిగా చెదిరినట్లయింది. దీంతో టూర్ ప్లాన్‌ను మనాలీ, సిమ్లా లకు మార్చుకున్నారు. తాము తిరిగి ఎంజాయ్ చేసిన ప్రాంతంలోనే ఉగ్రవాదులు కాల్పులు జరపడాన్ని అక్కడకు వెళ్లి వచ్చిన జైన్లు నమ్మలేకపోతున్నారు.

భీమవరానికి చెందిన ఓ బ్యాంకు ఉద్యోగి ఈ వేసవిలో పిల్లలతో కలిసి కశ్మీర్ వెళ్లేందుకు రెడీ అయ్యారు. అయితే పహల్గం కాల్పులతో ఒక్కసారిగా షాక్ తిన్న ఆ కుటుంబం టిక్కెట్లను రద్దు చేసుకుంది. జిల్లాలోని అన్ని పట్టణాల నుంచి ఈ సమ్మర్‌లో చాలా మంది జమ్ము, కశ్మీర్‌లో ఎంజాయ్ చేసేందుకు టూర్ ప్లాన్ చేసుకు న్నారు. మూడేళ్లుగా ఎటువంటి ఉగ్రవాద చర్యలు లేకపోవడంతో భూతల స్వర్గాన్ని కళ్లారా చూసి ఆనందించాలని కలలు గన్నారు. అయితే వీరి ఆశలపై పహల్గం కాల్పులు నీళ్లు చల్లినట్లయింది.

కశ్మీర్ టూర్ అందరికీ ఒక కల

ప్రపంచంలో స్విజర్లాండ్, కెనడా, పారిస్, కశ్మీర్ ప్రాంతాల్లోని ప్రకృతి అందాలను ఒక్కసారైనా చూడాలని ప్రతి టూరిస్ట్ కలలు కంటారు. భారతీయుడు కశ్మీర్ ఒక్కసారైనా చూడాలని ఆశిస్తాడు. అక్కడ ప్రసిద్ధిగాంచిన వైష్ణవీదేవి ఆలయం, కశ్మీర్ లేక్‌లో రాత్రి సమయాల్లో బోటులో తిరగాలని కలలు కంటారు. మంచు, పచ్చని చెట్లతో ప్రకృతి అందాలతో నిండుగా ఉండే పహల్గం, గురుమార్గ్, సోన్‌మార్గ్ ప్రాంతాలను కూడా చూసేందుకు ఇష్టపడుతుంటారు. అయితే 25 ఏళ్లుగా కశ్మీర్ ఉగ్రవాదులతో అల్లకల్లోలంగా ఉండటంతో టూరిస్టులకు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. నాలుగేళ్ల నుంచి ఇక్కడ పరిస్థితులు మారాయి. ఉగ్రవాదుల కదలికలు లేకపోవడంతో జిల్లా నుంచి చాలామంది పర్యాటకులు కశ్మీర్‌ను సందర్శిస్తూ వస్తున్నారు. అయితే పహల్గం కాల్పులతో ఇప్పట్లో అక్కడ పరిస్థితులు చక్కబడేలా కనిపించడం లేదు.



కశ్మీర్‌లో అందమైన పహల్గాంలో నరసాపురం వాసుల పర్యటన

వినగానే షాక్‌కు గురయ్యా



టూరిస్టులపై టెర్రరిస్టుల కాల్పుల్లో 26 మంది మృతి చెందారన్న వార్త వినగానే షాక్‌కు గురయ్యాను. మేము వెళ్లినపుడు అక్కడి ప్రజలు చాలా విషయాలు మాతో షేర్ చేసుకున్నారు.. 30 ఏళ్ల క్రితం నాటి పరిస్థితులు మళ్లీ వచ్చాయి.. టూరిస్టులు రాకతో మాకు ఉపాధి పెరిగింది. రాత్రి 11 గంటల వరకు బయట తిరగగలుగుతున్నామని చెప్పారు.. ఈ విషయాలన్నీ మా బంధువులు, స్నేహితులతో షేర్ చేసుకున్నాం.. దీంతో కొంతమంది అక్కడకు వెళ్లేందుకు టూర్ ప్లాన్ చేసుకున్నారు.. ఈ లోపు అక్కడ ఉగ్రవాద దాడులు జరగడం బాధాకరం..

- రాజేంద్రకుమార్ జైన్, నరసాపురం





వల్లూరు పల్లి మందేశ్వరస్వామి ఆలయం .. మందేశ్వరస్వామి

మహిమాన్వితుడు మందేశ్వరుడు

రాష్ట్రంలోనే రెండో శనీశ్వరాలయంగా ప్రసిద్ధి

వల్లూరుపల్లి మందేశ్వర స్వామి ఆలయం

1.70 కోట్లతో పునర్నిర్మాణం

పెంటపాడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే రెండవ ప్రసిద్ధ శనీశ్వర ఆలయంగా పెంటపాడు మండలం వల్లూరు పల్లి గ్రామంలోని బాలా త్రిపురసుందరి సమేత మందేశ్వర స్వామి ఆలయం పేరు గాంచింది. ఈ ఆలయానికి 120 సంవత్సరాల చరిత్ర ఉంది. శనివారం, శని త్రయోదశి రోజుల్లో భక్తులు తమ దోషాల పరిహారం కోసం ఆలయానికి అధిక సంఖ్యలో వస్తుంటారు.. నేడు శని త్రయోదశి పురస్కరించుకుని ఆలయ ప్రాశస్త్యంపై కథనం...

ఈ ఆలయాన్ని 1904వ సంవత్సరంలో నిర్మాణం చేసారు. వల్లూరుపల్లి గ్రామం మొదట అగ్రహారంగా ఉండేది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన ఆణివిళ్ళ సుందరరామశాస్త్రి ఈ గ్రామానికి వచ్చినప్పుడు ఈ ప్రాంతంలో శివాలయం నిర్మించాలని తలచారు. 1890లో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించగా 1904లో పూర్తయింది. ఆలయ పనులు నిర్మాణ దశలో ఉండగా వల్లూరుపల్లి గ్రామానికి చెందిన వేమూరి సీతారామ శాస్త్రి తమ పొలంలో పనిచేస్తున్నప్పుడు భూమి నుంచి మందేశ్వరుని విగ్రహం కనిపించింది. అయితే అదే రోజు రాత్రి స్వామి ఆయన కలలో కనిపించి తనకు కూడా గ్రామంలో శివాలయం నిర్మాణం చేయాలని స్వామి ఆదేశించారు. తొలుత రాజేశ్వరి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోనే పక్కన బాలా త్రిపుర సుందరి సమేత మందేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మాణం చేశారు. అప్పటి నుంచి ప్రజలు తమ శనిదోష పరిహారం కోసం ఈ ఆలయానికి వచ్చి పూజలు చేసుకుంటున్నారు.

1.70 కోట్లతో ఆలయ పునర్నిర్మాణం

ఆలయం నిర్మాణం చేసి 120 సంవత్సరాలు అయిపోవడంతో 1.70 కోట్లతో ఇటీవల ఆలయాన్ని పునర్నిర్మాణం చేశారు. శనీశ్వర ఆలయాలు రాష్ట్రంలో రెండే ఉన్నాయి. ఒకటి తూర్పు గోదావరి జిల్లా మందపల్లిలో ఉండగా, మరొకటి వల్లూరుపల్లి గ్రామంలో ఉంది. శనిత్రయోదశి రోజులలో దేవాలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. భక్తులు స్నానమాచరించేందుకు దేవాలయం సమీపంలోనే కాలువ ఉంది. మహిళలు స్నానమాచరించి వస్త్రాలు మార్చుకునేందుకు కాలువ సమీపంలో గదులు నిర్మాణం చేయాలని భక్తులు కోరుతున్నారు. వల్లూరుపల్లి ఆలయానికి వెళ్లాలంటే తాడేపల్లిగూడెం నుంచి పెంటపాడు, దర్శిపర్రు మీదుగా చేరుకోవచ్చు. అలాగే తణుకు తదితర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తణుకు, అలంపురం, రాచర్ల, మీదుగా చేరుకోవచ్చు.

పూర్వీకుల నుంచి స్వామి సేవలోనే..





పూర్వీకుల నుంచి ఈ ఆలయంలోనే స్వామి సేవ చేస్తున్నాం. మాది మూడో తరం. గతంలో మా గ్రామం అగ్రహారంగా ఉండేది. ఈ ఆలయానికి వస్తే విశ్వేశ్వరస్వామి, మందేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వ స్వామి వార్లను ఒకే సారి దర్శించుకోవచ్చు. భక్తులు తమ దోషనివారణ కోసం నువ్వుల నూనెతో అభిషేకం చేస్తే చాలా మంచిది. శనివారం, శని త్రయోదశిలో పూజలు మంచి ఫలితం ఇస్తాయి.

- పూజ్యం గంగాధరశర్మ, సత్యనారాయణ శర్మ, ఆలయ అర్చకులు





శ్రీచక్రవార్యుత్సవంలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్లు.. ధ్వజ అవరోహణ చేస్తున్న అర్చకులు

నయనానందకరం.. శ్రీచక్రవార్యుత్సవం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసుని దివ్య కల్యాణోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం లక్ష్మీపురంలోని ఆలయంలో జరిగిన శ్రీచక్రవార్యుత్సువం భక్తులకు నేత్రపర్వమైంది. ఆలయ అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ ఈ వేడుకను జరిపారు. పండితులు తమ శిరస్సులపై శ్రీచక్ర పెరుమాళ్లను ఉంచుకుని చక్రస్నానాన్ని నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు స్నపనం, చూర్ణోత్సవం, వసంతోత్సవం కన్నుల పండువగా జరిపారు. ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లతో పాటు శ్రీచక్ర పెరు మాళ్లను ఒక వేదికపై ఉంచి అభిషే కించారు. పాలు, పెరుగు, నీరు, తేనె, కొబ్బరి నీటితో వేద మంత్రాల నడుమ అభిషేకించారు. అనంతరం మూర్తులకు హారతులు సమర్పించారు. ఆలయ యాగశాలలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. రాత్రి ధ్వజావ రోహణ చేశారు.





గో సంరక్షణశాలలో షవర్ నీటితో సేదతీరుతున్న గోవులు, అశ్వం, గజలక్ష్మి

ఏమి హాయిలే ఇలా..





షవర్ బాత్‌ల వద్ద సేద తీరుతున్న మూగజీవాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు అటు భక్తులతో పాటు ఇటు దేవస్థానం సంరక్షణలో ఉన్న మూగజీవులు సైతం అల్లాడుతున్నాయి. శేషాచలంపై ఎండలకు విలవిల్లాడుతున్న గజ,అశ్వ, పశుపక్ష్యాదులు వేసవి తాపాన్ని తట్టుకునేలా కొండపై ఏర్పాటు చేసిన షవర్ బాత్‌ల వద్ద జలకాలాడుతూ రిలాక్స్ అవుతున్నాయి. గోసంరక్షణ శాలలో ఉన్న వందలాది గోవులను, గజ, అశ్వశాలలో ఉన్న ఏనుగును, గుర్రాలను, ఎండవేడిమి నుంచి కాపాడే చర్యల్లో భాగంగా దేవస్థానం షవర్ బాత్‌లను ఏర్పాటు చేసింది. అలాగే ఖజానా బాతులకు రక్షణగా నీటి కొలను ఏర్పాటు చేశారు. శేషాచలంపై ఉన్న గోసంరక్షణశాలలో 320 పైబడి వివిధ జాతుల ఆవులు. గిత్తలు, దూడలు ఉన్నాయి. అలాగే ఆలయ గజలక్ష్మి(ఏనుగు), అశ్వాలను సైతం శ్రీవారి సేవలకు గాను పోషిస్తున్నారు. ఎండవేడిమి నుండి వీటిని కాపాడేందుకు అవి నివసించే షెడ్ల పైన రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీల నుంచి తెచ్చిన ఎలిఫెంట్ క్రీపర్ పాదులను పెంచుతున్నారు. అలాగే షెడ్లలోపల భాగంలో కూల్ పెయింట్ వేసి, ఫ్యాన్‌లను ఏర్పాటు చేశారు.



నా శత్రువు నాటికలోని ఒక సన్నివేశం

అలరించిన నాటికలు

రెండోరోజు చైతన్య భారతి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చైతన్య భారతి సంగీత నృత్య నాటక పరిషత్ ఆధ్వర్యంలో భీమవరం డీఎన్ఆర్ కళాశాల గన్నాబత్తుల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న 18వ జాతీయ స్థాయి సాంఘిక నాటికోత్సవాల్లో రెండో రోజు శుక్రవారం రాత్రి 3 నాటికలు ప్రదర్శించారు. ముందుగా దుగ్గిరాల సోమేశ్వరరావు, కొత్తపల్లి శివరామరాజు సాంఘిక నాటిక పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి డాక్టర్ పీఆర్‌కే వర్మ, డాక్టర్ ముదునూరి గోపాలకృష్ణంరాజు, డాక్టర్ వేగేశ్న రవికుమార్ రాజు ప్రారంభించారు. నాటక పరిషత్ అధ్యక్షులు రాయప్రోలో భగవాన్, కార్యదర్శి మంతెన రామ్‌కుమార్ రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, భట్టిప్రోలు శ్రీనివాస్, పేరిచర్ల లక్ష్మణవర్మ, బోండా రాంబాబు, పెన్నాడ శ్రీను పోటీలను పర్యవేక్షించారు..

దూరమవుతున్న మానవ సంబంధాలపై 'నా శత్రువు'

టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరు. అవసరం ఉన్నా, లేకున్నా. ఏదిబడితే అది చూస్తు వెళితే మాత్రం జీవితం ఊహించని ప్రమాదాలు సంభవిస్తాయని తెలియజెప్పిన నాటిక యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ , హైదరాబాదు వారి నా శత్రువు నాటిక. ఇందులో పాత్రదారులుగా సత్యనారాయణ, సేనయన, యస్మిత, యస్ జ్యోతి నటించారు. ఈ నాటిక రచన అక్కల తామేశ్వరయ్య, దర్శకత్వం వడ్డాది సత్యనారాయణలు వహించగా నటినటులు తమ నటనతో నాటికను మరింత రసరమ్యంగా ముందుకు తీసుకువెళ్ళి అలరించారు.

కార్పొరేట్ డాక్టర్ల తీరును చెప్పిన 'చిగురు మేఘం'

కార్పొరేట్ ఆసుపత్రిలో డబ్బు సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్ల తీరును అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి చిగురు మేఘం నాటిక తెలియజేసింది. బంధాలు మరిచి ఒక కార్పొరేట్ ఆస్పత్రి అధిపతి కూమర్తెను పెళ్ళాడి సంపాదనే ధ్యేయంగా ఉన్న డాక్టర్‌ని, పేదరికంలో ఉన్న తల్లీతండ్రి చాలా సంవత్సరాల తరువాత కనిపించి రోగగ్రస్థులై డాక్టర్ చేతిలో చనిపోవడంతో డాక్టర్‌గా తాను చేసిన తప్పుకు పశ్చాత్తాపపడి తన తల్లిదండ్రుల లాంటి వారు గ్రామాల్లో ఎన్నో జబ్బులతో ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని వారికి వైద్యం చేయడానికి డాక్టర్ గ్రామాలకు వెళ్ళిపోవడంతో నాటకం ముగుస్తుంది.నాటిక రచన సత్యనారాయణ, మూలకథ ధూపాటి తిరుమల్లేశ్వరరావు, నటీనటులుగా యేపూరి హరిబాబు, ఎన్ఎస్ఆర్‌పి ప్రసాద్, కె మస్తాన్‌రావు, కె.సరిత నాటికను రక్తి కటించారు.

మానవ సంబంధాల విలువ తెలియజెప్పే 'మా ఇంట్లో మహాభారతం'

తన భర్త విచ్చలవిడిగా ఆస్తిని పాడుచేస్తున్నాడని గ్రహించిన భార్య తన తెలివి తేటలతో ఆస్తిని కాపాడుతూ భర్త పేరును నిలబెట్టిన కుటుంబ కథా సారాంశంతో సాగిన మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారత నాటిక. రచన మద్దుకూరి రవీంద్రబాబు, దర్శకత్వం నడింపల్లి వెంకటేశ్వర రావు, పాత్రదారులు సాలూరి జ్యోతిరాణి, శ్రీహరిరావు, పిల్లి కోటేశ్వరరావు తమ హాస్యనటనతో ప్రేక్షకుల్ని నవ్వులతో ముంచారు.

బాలల భవిత బందీ

శనివారపు పేటలో ప్రభుత్వ బాలుర గృహం



ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : అనాథలు.. తల్లిదండ్రుల ఆదరణలేని బాలలు.. తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు. తల్లిదండ్రుల మాట వినకుండా మొండికేస్తున్నారు. కొంతమంది బాల నేరస్తులుగా మారిపోతున్నారు. ఇలాంటి వారందరినీ ఏలూరు శనివారపు పేటలో ఉన్న ప్రభుత్వ జువైనల్ హోమ్‌కు చేర్చి వారికి విద్యాబుద్ధులు నేర్పించి వారిలో సత్ప్రవర్తన వచ్చేలా చేసి మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది.. వసతి గృహం, స్కూల్ అయితే ఉంది గానీ విద్యా బుద్ధులు చెప్పేవారే లేరు.. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు.

తెలిసీ తెలియని వయసులో చెడు వ్యసనాలకు బానిసలు

సన్మార్గంలో నడిపించడానికి ఏలూరులో వసతి గృహం

ఉపాధ్యాయులు లేక విద్యకు దూరం

ప్రస్తుతం 60 మంది బాలలు

చట్టాలపై అవగాహన కల్పించి బాలలను సన్మార్గంలో నడిపించడంలో వైఫల్యాల కారణంగా బాలలు ఇంకా చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. క్షణికావేశంలో కొంతమంది ఇల్లు వదిలి వెళ్ళిపోతున్నారు. మరికొంత మంది చదువు వదిలివేసి బాల కార్మికులుగా మారిపోతున్నారు. జిల్లాలో వివిధ శాఖల అధికారులు స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తూ ఇలాంటి వారిని గుర్తించి ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ జువైనల్ హోమ్‌కు తరలిస్తున్నారు. తల్లి కాని తండ్రి కాని మరణించి ఆ కుటుంబంలో ఆర్థిక పరిస్థితులు ఇబ్బందిగా ఉండి మాట వినని బాలలను కూడా ఈ వసతి గృహంలో ఉంచుతున్నారు. ఏలూరు శనివారపుపేటలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహానికి ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో ఉన్న బాలలను తీసుకువచ్చి ఈ వసతి గృహంలో ఉంచుతున్నారు. రాష్ట్రంలో ఇలాంటి ప్రభుత్వ వసతి గృహాలు విశాఖపట్టణం, ఏలూరు (శనివారపుపేట), కడప, తిరుపతి ప్రాంతాల్లో మాత్రమే ఉన్నాయి. రైల్వేస్టేషన్లలో, బస్టాండ్లలో తిరిగే బాలలు, తల్లిదండ్రుల మాట విననివారిని ఇక్కడకు తీసుకువచ్చి ఉంచుతున్నారు. ప్రస్తుతం 60 మంది బాలలు ఉన్నారు. చదువుకోసం గతంలో వీరిని శనివారపుపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు పంపించేవారు. అయితే అక్కడికి వెళ్లిన బాలలు తిరిగి వచ్చేటప్పుడు, వెళ్ళేటప్పుడు అదృశ్యం కావడంతో చివరకు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో ఆ వసతి గృహంలో హైస్కూలు ఏర్పాటుకు అనుమతించి గుర్తింపు కూడా ఇచ్చారు. కొంత కాలం పాటు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇక్కడకు పంపించినా ఈ ఏడాది విద్యాశాఖ అధికారులు పంపించకపోవడంతో ప్రస్తుతం అక్కడ అంతంత మాత్రంగానే చదువు కొనసాగుతోంది.

విద్యాబుద్ధులు నేర్పేవారు కరువు

ప్రాథమిక స్కూలు వరకూ 29 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు టీచర్లను ప్రభుత్వం డిప్యూటేషన్లపై పంపించింది. హైస్కూలుకు మాత్రం ఒక్క టీచరును కూడా పంపలేదు. కొంతమంది స్వచ్ఛందంగా వెళ్లి వారికి ఖాళీ ఉన్న సమయంలో విద్యా బోధన చేస్తున్నారు. 33 మంది విద్యార్థులు ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఉన్నారు. ఈ ఏడాది ఏడుగురు విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాశారు.విద్యార్థులకు తెలుగు భాష నేర్పించడానికి ఒక రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాతృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో అక్షర జ్ఞానం అనే పుస్తకాన్ని అక్షరాల నుంచి పదాలు వాక్యాలు వరకూ తయారు చేసి ఆ సంస్థలో ఉన్న వలంటీర్లు వచ్చి నేర్పిస్తున్నారు. సత్ప్రవర్తన కోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాలతో ఒక సైకాలజిస్టు వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఓఎన్‌జీసీ పీఈటీని ఏర్పాటు చేశారు. అంతే కాకుండా షటిల్, చెస్ వంటి వాటిని నేర్పించడానికి ఆ సంస్థే స్పాన్సర్‌గా నిలుస్తుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇక్కడ బాలలను సంరక్షణ చేయడానికి ఉపాధ్యాయులను నియమించి బాలలను సత్ప్రవర్తనలో తీసుకురావడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.



సదస్సులో పాల్గొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

నక్కపల్లిలో త్వరలో స్టీల్ ప్లాంట్

కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ

భీమవరంటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్, నిప్పాన్ స్టీల్స్ సంయుక్తంగా ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, దీనిలో సుమారు లక్షా 40 వేల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టనున్నా రని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ముంబయిలో జరుగుతున్న ఇండియా స్టీల్-2025 సదస్సులో భాగంగా రెండో రోజు శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ సహ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భారత్, రాష్ట్ర పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు హాజరై సుదీర్ఘంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రధాని మోదీ, సీఎం నారా చంద్ర బాబు నాయుడు నేతృత్వంలో, గత 10 నెలల కాలంలో రాష్ట్రం భారీ పెట్టు బడులను ఆకర్షించిందన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి పనులు, అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో త్వరలో ప్రారంభమ వుతున్న కీలక స్టీల్ ప్రాజెక్టులతో భారత్ స్టీల్ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యత పెరు గుతుందన్నారు.

బాలా త్రిపురసుందరి అమ్మవారికి 250 గ్రాముల వెండి బహూకరణ

భీమవరం టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి పీఠానికి దాతల 250 గ్రాముల వెండిని విరాళంగా అందించారు. గురువారం పట్టణానికి చెందిన కూనపరెడ్డి హృషికేష్, పూర్ణకళ దంపతులు వెండిని ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు పూజలు చేసి దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు. అమ్మవారి వెండి పీఠానికి దాతలు ముందుకు వచ్చిన విరాళాలు అందిస్తున్నారని వారికి ఆలయ కమిటీ తరుపున కృతజ్ఞతలు తెలుతున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.



దాహం తీర్చుకునేందుకు కాకి ఒకటి భీమవరంలో ఇలా వాటర్ ట్యాప్‌ల వద్ద తెగ ట్రై చేసింది.. పాపం.. కానీ ఎంత ప్రయత్నించినా ఒక్క నీటి చుక్క కూడా రాలేదు..

- ఫోటోగ్రాఫర్, భీమవరం



హమ్మయ్య..దాహం తీర్చుకుందాం..



నీటి చుక్క రాదే..



ఇంకోసారి గట్టిగా ట్రై చేద్దాం..



అబ్బా.. లాభం లేదు..

ఎంఈవోల ద్వారా టీచర్లకు కొత్త మెడికల్ సర్టిఫికెట్లు జారీకి ఏర్పాట్లు

హాజరు కానివారికోసం నేడూ మెడికల్ చెకప్ క్యాంపు : డీఈవో

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సాధారణ బదిలీల్లో ప్రత్యేక అర్హతా పాయింట్ల కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని హెచ్‌ఎంలు, టీచర్లకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రెండురోజులుగా కొనసాగుతున్న మెడికల్ చెకప్ క్యాంపులో భాగంగా శుక్రవారం పశ్చిమగోదావరి జిల్లాలోని మండలాల ఉపాధ్యాయులకు మెడికల్ అసెస్‌మెంట్ క్యాంపు జరిగింది. క్యాంపును కాకినాడ ఆర్జేడీ నాగమణి, డీఈవో వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. సాయంత్రం వరకు మొత్తం 190 మందికిపైగా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల పాత మెడికల్ సర్టిఫికెట్లను, ఆరోగ్య రికార్డులను వైద్య నిపుణుల బృందాలు పరిశీలించాయి. రెండురోజుల పాటు నిర్వహించిన మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరు కాలేని హెచ్‌ఎంలు, టీచర్లకోసం శనివారం కూడా క్యాంపు కొనసాగుతుందని, ఏదైనా కారణంతో హాజరు కాలేకపోయినవారంతా చివరిరోజు హాజరు కావచ్చునని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. త్వరలో నిర్వహించనున్న బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లు పొందాలనుకునేవారంతా ఇపుడు నిర్వహిస్తోన్న మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరై నమోదు చేయించుకుని మెడికల్ బోర్డు అసెస్‌మెంట్ అనంతరం జారీచేసే కొత్త సర్టిఫికెట్లను మాత్రమే బదిలీల కౌన్సెలింగ్‌కు పరిగణనలోకి తీసు కుంటామని, క్యాంపునకు హాజరుకాకుండా నేరుగా తీసుకునే మెడికల్ సర్టిఫికెట్లను అనుమతించబోమని స్పష్టం చేశారు. కాకినాడ ఆర్జేడీ మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయు లందరికీ కొత్త మెడికల్ సర్టిఫికెట్లను రాగల మూడు రోజుల్లో సంబంధిత మండల విద్యాధికారుల ద్వారా జిల్లా విద్యా శాఖ అందజేసేందుకు ఏర్పాట్లు చేసిందని వివరించారు. కొత్త సర్టిఫికెట్లను తీసుకునేందుకు మళ్లీ సర్వజన ఆసుపత్రికి రానవసరం లేదని డీఈవో స్పష్టం చేశారు.



నడిపూడి ర్యాంపులో యంత్రాలతో ఇసుక తవ్వుతున్న దృశ్యం

అడ్డగోలు తవ్వకాలు

- నాలుగు ర్యాంపులలో ఇసుక అక్రమ తవ్వకాలు
- లారీ రూ.5 వేలు వసూళ్లు
- నిషేధం ఉన్నా సీఆర్‌జడ్ పరిధిలో ఆగని దోపిడీ
- చోద్యం చూస్తున్న అధికారులు
- రూ.కోట్లలో ఇసుక దందా

పాలకొల్లు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆచంట నియోజకవర్గ పరిధిలోని నడిపూడి, కోడేరు, భీమలాపురం కరుగోరుమిల్లి, ర్యాంపులలో ఇసుక, బొండు, మట్టి అడ్డగోలుగా తవ్వేస్తున్నారు. సీఆర్‌జడ్ పరిధిలో ఇసుక మట్టి తవ్వకాల్లో నిషేధం ఉన్నప్పటికీ యథేచ్ఛగా యంత్రాలతో తవ్వేస్తున్నారు. నడిపూడి ర్యాంపులో రోజుకు సుమారు 150 లారీలు ఎగుమతి అవ్వుతుండగా కోడేరు, భీమలాపురం కరుగోరు మిల్లి ర్యాంపులతో మరో 150 లారీలు ఇసుక, బొండు, మట్టిని తరలించేస్తున్నారు. మొత్తంగా రోజుకి 300 లారీలకు పైబడి అక్రమ ఎగుమతులు జరుగుతున్నాయి. నిషేధం ఉన్న ప్రాంతాలలో అక్రమంగా తవ్వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు నిద్రావస్థలో ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రోజుకు రూ.10 నుంచి 15 లక్షలు అక్రమ వసూళ్లకు పాల్పడుతుండగా నెలకు సుమారు రూ.12 కోట్లు అక్రమార్జన ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయనే దానిపై సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అండదండలతోనే ఈ దండా కొనసాగుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక పాలసీ అమలులోకి తెచ్చారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, నేరుగా ర్యాంపుల్లోకి, నదీ పాయల్లోకి వెళ్లి ఇసుక ఉచితంగా తెచ్చుకునే వెసులుబాటు కల్పించగా లారీలకు నిర్ధేశిత రుసుం నిర్ణయాంచారు అయితే ఇప్పుడు నిబంధనలను భేఖాతరు చేస్తూ నాలుగు ర్యాంపులలోనూ 5 యూనిట్లు ఇసుక రూ.5 వేలు, బొండు ఇసుక రూ.3500, మట్టికి రూ.4 వేలు వసూల్లు చేస్తున్నారు. అధకార పార్టీలోని కొందరు నాయకులు ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్న తీరుపై కూటమి శ్రేణుల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులను ప్రలోభ పెట్టి అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నరనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. ఇసుక వ్యవహారంలో ఇప్పటికే కూటమి ప్రభుత్వానికి కొంత మేర నష్టం కల్గింది. ఇప్పుడు జగన్‌రెడ్డి పాలన మించి జరుగుతున్న ఇసుక దందా ఇలానే ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని కూటమిలోని నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. జిల్లాలో వాస్తవంగా ఇసుక వినియోగం తగ్గింది. నవ్యాంధ్ర ఏర్పడిన తొలినాళ్లలో పాత పశ్చిమ గోదావరి జిల్లాలో రోజుకి వెయ్యి లారీలకు తగ్గకుండా ఇసుక సేకరించేవారు. ఇప్పుడు వినియోగం రోజుకి 300 లారీలకు పడిపోయింది. అయినప్పటికీ ఇసుక అక్రమ అమ్మకాలు అధిక ధర వసూల్లు తగ్గలేదు. రాష్ట్ర స్థాయి అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలు అమ్మకాలపై దృష్టి సాధించకుంటే కూటమి ప్రభుత్వం అప్రతిష్ట పాలవుతుందని పలువురు హెచ్చరిస్తున్నారు.

పగలు ఈస్ట్ ..రాత్రి వెస్ట్ సరిహద్దుల్లో తవ్వకాలు

ఆచంట,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం లంకగ్రామాల్లో ఇటీవల ఇసుక, మట్టి తవ్వకాలు మరలా మొదలయ్యాయి. తవ్వకాలకు పర్మిషన్ వచ్చిదంటూ కోనసీమ జిల్లాకు చెందిన కొంత మంది ర్యాంప్ వేసి మట్టి, ఇసుక తవ్వకాలు మొదలెట్టారు. అయితే పగలు కోనసీమ జిల్లా సరిహద్దు ప్రాంతంలో తవ్వకాలు జరిపి రాత్రి వేళల్లో వెస్ట్ సమీప ప్రాంతాల్లో అక్రమంగా ఈ తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ దందా గత కొన్ని రోజులుగా పెదమల్లం అనగారలంకలో జరుగుతున్నట్లు సమాచారం. ఈ అక్రమ తవ్వకాల్లో కోనసీమ జిల్లాకు చెందిన కొంత మంది ఈ దందాకు పాల్పడుతున్నారని చెబుతున్నారు. ప్రతీరోజూ సుమారు 30 నుంచి 50 లారీలకు పైగానే అక్రమంగా ఇసుక, మట్టి తరలిపోతున్నట్లు సమాచారం. గప్ చిప్‌గా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోలేదని విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. పెదమల్లం లంకలో జరుగుతున్న అక్రమ ఇసుక, మట్టి తవ్వకాలుపై తహసీల్దార్ జి.కనక రాజును వివరణ కోరగా దీనికి సంబంధించి సిబ్బంది సరిహద్దు ప్రాంతానికి పంపించడం జరిగిందని అయితే కోనసీమ జిల్లా నాగుళ్ళంక సరిహద్దులో మాన్యువల్‌గా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారని ఈ తవ్వకాలు కోనసీమ జిల్లా పరిధిలో జరుగుతున్నట్లు తెలిపారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం తమ పరిధి కాదన్నారు.



ఇసుక లోడుతో లంక గ్రామంలో టిప్పర్‌లు



ముదినేపల్లి మండలం చేవూరులో రైతులను విచారిస్తున్న సీబీఐ అధికారులు

ఫోర్జరీ లీజు డాక్యుమెంట్లతో రుణాలు

- ముదినేపల్లి మండలంలో సీబీఐ అధికారుల విచారణ
- తమకు తెలియదంటున్న రైతులు
- జాతీయ బ్యాంక్‌కు తాడేపల్లిగూడెం వాసి టోకరా

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పేరున చేపల చెరువుల లీజు పేరిట తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి ఓ వ్యక్తి బ్యాంకు నుంచి కోట్లాది రూపాయల రుణాలను తీసుకున్న ఉదంతం వెలుగు చూసింది. వరి సాగులో ఉన్న భూములను సైతం చేపల చెరువులుగా చూపించి రుణాలు తీసుకోవడం గమనార్హం. 2015లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 188 రైతుల నుంచి చేపల చెరువుల తవ్వకానికి భూములను లీజుకు తీసుకుని రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్.కిరణ్ అనే వ్యక్తి భీమవరంలోని ఒక జాతీయ బ్యాంక్ నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదు. బ్యాంక్ అధికారులు ఆరా తీయగా రుణాలు తీసుకోవ డంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిసింది. దీనిపై ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు విశాఖపట్నం సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయడంతో 2024 అక్టోబరులోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ విషయాలేవీ స్థానిక రైతులకు సీబీఐ అధికారులు విచారణకు వచ్చేవరకు తెలియక పోవడం గమనార్హం. ఈ కేసు విచారణలో భాగంగా గత రెండు రోజులుగా సీబీఐ అధికారులు ముదినేపల్లి మండలంలో బ్యాంకు డాక్యుమెంట్లపై సంతకాలున్న రైతులను విచారించారు. గురువారం గురజ, దేవరం, సింగరాయపాలెం, అల్లూరు, శుక్రవారం చేవూరు పరిధిలో విచారణ నిర్వహించారు. గురజలో చేపట్టిన విచారణలో 2020లో చేపలు చెరువులు తవ్వగా 2015లోనే చెరువులపై రుణాలు తీసుకున్నట్టుగా బయట పడింది. మీ భూమి పోర్టల్‌లో నమోదైన పలువురు భూ యజమానుల పేరున రుణాలు తీసుకున్నట్టు అధికారులు చెప్పగా,వారు సుమారు 30 ఏళ్ల క్రితమే మరణిం చారని రైతులు తెలిపారు. కొంతమంది విద్యా వంతులు సంతకాలకు బదులు వేలిముద్రలు వేసినట్టు, కొంతమంది నిశానిదారులు బాండ్లపై సంతకాలు చేసినట్టు గుర్తించారు. సింగరాయపాలెం ఏరియాలోని చేపల చెరువుల రైతులు కె.నాగబాబు, పి.నరసింహా రావు, సీహెచ్ సుబ్రహ్మణ్యం తదితరులు తమ పేరున భీమవరం బ్యాంక్‌లో రుణాలు తీసుకున్నట్టు తెలిసి అవాక్కయ్యారు. చేవూరులో శుక్రవారం సీబీఐ అధికారులు రైతులను విచారించగా, తాము రుణాలు తీసుకోలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేశారని వల్లభనేని వెంకట్రావుతో పాటు పలువురు రైతులు అధికారులకు తెలిపారు. వీఆర్వోల సమక్షంలో భూముల సర్వే నంబ ర్లను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 188 మంది రైతులను విచారించి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారులు తెలిపారు.

సహకారం ఎవరిది ?

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కిరణ్ అనే వ్యక్తి ముదినేపల్లి మండలంలోని రైతుల పేరున లీజు అగ్రిమెంట్లు సృష్టించడం వెనుక ఎవరి సహకారం ఉందనేది చర్చ నీయాంశంగా మారింది. ముదినేపల్లి ప్రాంతంలో అంతకుముందు చేపల చెరువులకు భూములు లీజుకు తీసుకున్న ఆ ప్రాంతానికి చెందిన లీజుదారులు ఎవరైనా సహకరించి ఉంటారని లేదా స్థానికులు ఎవరైనా సర్వే నంబర్లు చెప్పి ఉండవచ్చని భావిస్తున్నారు.

19 నుంచి ఓపెన్ స్కూల్ సప్లిమెంటరీ పరీక్షలు

అమరావతి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు మే 19 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు సొసైటీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. 24 వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొంది. పరీక్షా కేంద్రాలు కేటాయించాలని ప్రభుత్వ పరీక్షల విభాగానికి లేఖ రాసినట్టు తెలిపింది. మే 26 నుంచి 30 వరకు ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు పేర్కొంది.

బీచ్‌లో యువకుడిని కాపాడిన పోలీసులు



మొగల్తూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):పేరుపాలెంలో అలల ఉధృతికి లోపలికి కొట్టుపోతున్న ఒక యువకుడిని తీరం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు రక్షించారు. శుక్రవారం ద్వారకాతిరుమలకు చెందిన మోటార్‌సైకిల్ మెకానిక్ వీరవల్లి మధు అనే 17 సంవత్సరాల యువకుడు పేరుపాలెం సాగర తీరానికి వచ్చాడు. మధ్యాహ్నం సమయంలో సముద్ర స్నానం చేస్తూ అలల ఉధతికి గురై కొట్టుకుపోతున్నాడు. ఈవిషయాన్ని గమనించిన పోలీస్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, హెచ్ జి.హరిలు ఆ యువకుడును కాపాడి ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే ఎక్కువ నీరు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న ఆ యువకుడుకి సపరియలు చేశారు. కాపాడిన పోలీసు సిబ్బందిని స్థానికులు, పర్యాటకులు అభినందించారు.

చైన్ స్నాచర్ అరెస్టు

భీమవరం క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుపోతున్న దొంగను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన సంఘటన పట్టణంలో చోటుచేసుకున్నది. వన్‌టౌన్ ఎస్ఐ కృష్ణాజీ తెలిపిన వివరాల ప్రకారం.. మెంటేవారి తోటకు చెందిన జి.వాసవి అనే మహిళ తన సొంత దుకాణానికి వెళ్ళి సాయంత్రం సమయంలో ఇంటికి వెళ్తున్నారు. సరిగ్గా బుధవారం మార్కెట్ అండర్ టన్నెల్ వద్దకు వెళ్ళేసరికి పాలకొల్లుకు చెందిన కొప్పర్తి సూర్యపాల్ అనే యువకుడు వాసవి మెడలోని బంగారు గొలుసును లాగడానికి ప్రయత్నించాడు. అయితే ఆ సమయంలో ఆమె చైన్‌ను గట్టిగా పట్టుకోవడంతో సూత్రాలు ఆమె చేతిలో ఉండిపోయాయి. గొలుసు అతను లాక్కున్నాడు. ఆమె కేకలు వేసింది. దీంతో యువకుడు కత్తి చూపించి చంపేస్తానంటూ బెదిరించాడు. ఆమె కేకలు విన్న స్థానికులు అతనిని పట్టుకుని కత్తి లాక్కున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- దొంగను అరెస్టు చేసిన పోలీసులు
- సుమారు రూ.25 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చేసి విలేకరులకు వివరాలు చెబుతున్న డీఎస్పీ రవిచంద్ర

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి తాళం వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని పట్టపగలే చోరీలకు పాల్పడుతూ, మొదటి రెండు చోరీలలోనే ఇరవై లక్షల విలువైన బంగారం దోచుకెళ్ళిన ఇరవై ఒక్క ఏళ్ళ ఒంటెద్దు క్రాంతి కుమార్ ను మూడవకన్ను అతి సులభంగా పట్టించింది. జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ యు.రవిచంద్ర శుక్రవారం రాత్రి విలేకరుల సమావేశంలో ఆ వివరాలు తెలియజేశారు. టి.నరసాపురం మండలం సింగరాయపాలెం గ్రామానికి చెందిన క్రాంతి కుమార్ వృత్తి రీత్యా ప్లంబర్. జంగారెడ్డిగూడెం పట్టణంలో ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. ఈ నెల 14వ తేదీ ఉదయం త్రివేణి కాలేజీ ఎదురుగా ఉన్న రోడ్డులో ఓ ఇంటికి తాళం వేసి ఉండడం చూసిన క్రాంతి కుమార్ గోడ దూకి లోపలికి వెళ్ళాడు. తనతో తెచ్చుకున్న ప్లంబింగ్ సామాన్ల సంచిలో తెచ్చుకున్న కట్టర్ మిషన్‌తో తాళం కట్ చేసి ఇంటి లోపలికి ప్రవేశించాడు. లోపల బెడ్ రూములో ఉన్న బీరువా తాళాలు కూడా తొలగించి అందులో ఉన్న డబ్బు, నగలు తస్కరించాడు. ఆ తర్వాత రోజు 15వ తేదీ ఉదయం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి వెనుక డాంగే నగర్ సమీపంలో మరొక ఇంటికి తాళం వేసి ఉండటాన్ని చూసి ఆ ఇంటి గోడ దూకి మెయిన్ డోర్ మెస్‌డోర్‌ని స్క్రూ డ్రైవరుతో తొలగించి,మెయిన్ డోర్ లాకర్‌ను కటింగ్ మిషన్‌తో కట్ చేసి లోపలికి ప్రవేశించాడు. లోపల బీరువా తాళం తీసి అందులో ఉన్న బంగారు వస్తువులను తీసుకుని పారిపోయినట్లు డీఎస్పీ తెలిపారు. అప్పటికే పట్టణంలో అన్ని ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పోలీసు సిబ్బంది వాటిని జల్లెడ పట్టి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు రూ.20 లక్షల విలువైన 25 గ్రాముల చోరీ సొత్తు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతనిపై షీటు ఓపెన్ చేసి అతని కదలికలు నిత్యం గమనిస్తూ ఉంటామ న్నారు. కేసును త్వరగా ఛేదించిన సీఐ కృష్ణబాబు, ఎస్సై ఎస్‌కె.జబీర్, ఏఎస్సై సంపత్ కుమార్, పీసీలు ఎన్.రమేష్,రాజశేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

సొసైటీ కార్యదర్శి ఆత్మహత్య

ఇరగవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇరగవరం మండలం కొత్తపాడు సొసైటీ కార్యదర్శి చల్లా వీర వెంకట సత్యసాయిబాబు ఉరి వేసుకుని శుక్రవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామానికి చెందిన చల్లా వీర వెంకట సత్యసాయిబాబు 2015వ సంవత్సరం నుంచి ఇరగవరం మండల కొత్తపాడు సొసైటీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల సొసైటీ లావాదేవీలు ఆన్‌లైన్ ప్రక్రియ జరుగుతున్నది. ఈ ఆన్‌లైన్ ప్రక్రియను సొసైటీ కార్యాలయంలో కాకుండా ఇంటి వద్దే ల్యాప్‌టాప్‌లో నమోదు చేసేవారు. రెండు రోజులకొకసారి కార్యాలయానికి వచ్చి ఏమైనా సంతకాలు అవసరమైతే పెట్టి వెళ్ళిపోయేవారు. ఈయన ఆఖరుగా సోమవారం సొసైటీకి వచ్చి వెళ్ళిపోయినట్లు సిబ్బంది చెప్పారు. ఆ రోజు నుంచి అతని ఫోన్ పనిచేయడం లేదని ఆయనకు కావాలసిన సమయంలో మాత్రం ఫోన్ ఆన్‌చేసి మిగతా సమయంలో ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉండేదని కార్యాలయ సిబ్బంది తెలిపారు. సాయిబాబు కుటుంబ ఆర్థిక కారణాల వల్ల చనిపోయారా, సొసైటీ లావాదేవీలు కంప్యూటరైజేషన్ ఒత్తిడి కారణంగా చనిపోయారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతికి ముందు సాయిబాబు రెండు లేఖలు రాసినట్లు తోటి సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఈ లేఖ ఒకటి కార్యాలయ సిబ్బందికి, మరొకటి కుటుంబ సభ్యులకు రాసినట్లు సమాచారం. ఈ లేఖను కుటుంబ సభ్యులు గోప్యంగా ఉంచుతున్నారని సిబ్బంది చర్చించుకుంటున్నారు. సాయిబాబుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇల్లు దగ్ధం

ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి బీసీకాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పేరం సుబ్బారావు ఇల్లు దగ్ధమైంది. సుబ్బారావు తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్లాడు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు రావడంతో చుట్టు పక్కలవారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సంఘటనలో ఇంటిలో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయి, సుబ్బారావు కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



డోలిపై మృతదేహాన్ని తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది, స్థానికులు

పెదబయలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు పాడేరు జిల్లా పెదబయలు మండలం జామిగూడ పంచాయతీలో గల తారాబు జలపాతంలో గురువారం గల్లంతైన భీమడోలుకు చెందిన బీటెక్ విద్యార్థి గొన్నూరి కిశోర్ (22) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. పెదబయలు ఎస్ఐ కొల్లి రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణయ్య ఆధ్వర్యంలో స్థానికులు శుక్రవారం ఉదయం నుంచి గాలింపు చేపట్టారు. జలపాతంలో రాళ్ల మధ్యలో ఇరుక్కున్న మృతదేహాన్ని అతి కష్టం మీద తాళ్ల సాయంతో స్థానికులు వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జిల్లా కలెక్టర్ చొరవతో అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న కిశోర్ తల్లిదండ్రుల రోదన స్థానికులను కలచివేసింది.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

నరసాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెడికల్ షాపుల్లో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా ఎంపిక చేసుకున్న దుకాణాల్లో ఆకస్మికంగా వెళ్లి షాపుల్లో వేర్వేరుగా తనిఖీలు చేశారు. వయాగ్రా , నిద్రమాత్రలతో పాటు మత్తు కలిగించే కొన్ని మందులపై ప్రభుత్వం నిఘా పెట్టింది. వైద్యుల చీటీ లేకుండా, రశీదులు లేకుండా వీటిని అమ్మకూడదు. అయితే కొందరు వ్యాపారులు అక్రమంగా తీసుకొచ్చి అమ్ముతున్నారన్న ఫిర్యాదులపై రాష్ట్ర ప్రభుత్వం షాపుల్లో తరుచూ తనిఖీలు చేయాలని అదేశించింది. దానిలో భాగంగా జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లిఖార్జున్‌తో పాటు ఏడీ చక్రవర్తి నేతృత్వంలో ఈ దాడులు చేశారు. అయితే దాడులు జరుగుతున్న విషయాన్ని తెలుసుకుని వీటిని విక్రయిస్తున్న షాపు యాజమానులు వెంటనే ఈ మందుల్ని బయటకు పంపేశారు. గతంలో ఇలాంటి దాడులు చేసినప్పుడు కూడా ఎవరిపై కేసులు నమోదు చేయలేదు.

చెల్లి మృతి తట్టుకోలేక..

పురుగు మందు తాగి అన్న మృతి

పెనుగొండ , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : చెల్లెలి మరణం తట్టుకోలేక అన్నయ్య మృతి చెందినట్లు ఎస్ఐ కొప్పిశెట్టి గంగాధర్ తెలిపారు. పెనుగొండ మండలం సిద్దాంతం గ్రామానికి చెందిన ఈడువిల్లి బాలలక్ష్మీనర్సింహ(21) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల అతని చెల్లెలు అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉరి వేసుకుని మృతి చెందింది. ఆమె మృతిని తట్టుకోలేక అన్నయ్య ఈ నెల 12వ తేదీ తన ఇంటి వద్ద కలుపుమందు తాగేశాడు. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం తణుకు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి త రలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేపై లారీ బోల్తా: డ్రైవరు మృతి



ఘటనా స్థలం వద్ద ధనుంజయ్ సింగ్ మృతదేహం

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గ్రీన్ ఫీల్డ్ హైవే లారీ డ్రైవర్ ధనుంజయ్ సింగ్ (44) మృతి చెందాడు. లక్కవరం ఎస్సై శశాంక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జార్కండ్ రాష్ట్రం పిప్రా గ్రామానికి చెందిన మృతుడు ధనుంజయ్ సింగ్ (44) గత కొంత కాలంగా మండలంలోని పుట్లగట్లగూడెం వద్ద ఏర్పాటు చేసిన గ్రీన్ ఫీల్డ్ హైవే స్టాక్ పాయింట్‌లో కాంక్రీట్ మిక్సర్ లారీ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం లారీలో కాంక్రీట్ తీసుకుని పంగిడిగూడెం వైపుకు వెళ్తున్నాడు. రహదారి మధ్యలో సాంకేతిక కారణాలతో లారీ నిలిచిపోయింది. దీంతో ధనుంజయ్ సింగ్ లారీను స్టార్ట్ చేయగానే లారీ వెనక్కి వెళ్ళి డివైడర్‌ను ఢీకొట్టి తిరగబడింది. ఈ ప్రమాదంలో ఘనుంజయ్ సింగ్ తలకు తీవ్రగాయాలై ఘటనా స్థలం వద్దనే మృతి చెందాడు. గ్రీన్ ఫీల్డ్ హైవే సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ కిషోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోగులంపాడులో చిమట శివయ్య(30) శక్రవారం స్థానిక రైతు పాలడుగు నాగేంద్రబాబుకు చెందిన పామాయిల్ తోటలో గెలలు కోసేందుకు కూలీకి వెళ్ళాడు. గెలలు కోసే క్రమంలో పామాయిల్ చెట్టు పైన ఉన్న 11కేవి విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు కత్తి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముసునూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శివయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ANDHRA JYOTHI AJC CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి DAILY CLASSIFIEDS క్లాసిఫైడ్స్ (ప్రతిరోజు)

FLATS FOR SALE
శ్రీ సాయి తేజ రెసిడెన్సీ నందు 3BHK (1650 చ.అ.) ఫ్లాట్స్ ఏలూరు సత్రంపాడు పంచాయతీ ఆఫీసు ఎదురుగా, గృహప్రవేశమునకు సిద్ధముగా కలవు. సంప్ర: 92464 11088
AJB-235067

రియల్ ఎస్టేట్
(అమరావతి) శ్రీ కృష్ణ బృందావనం ! ఫార్మ్‌హౌస్ లాండ్ గుంటూరు నుండి బోయపాలెం మీదుగా కొండవీడు 25 కి.మీ. పర్యటక ప్రాంతం సమీపంలో @ సెంటు (1Lac) లక్ష రూపాయలు, 14 సెంట్లు, 10 సెంట్లు బిట్స్ కలవు, తోట వేసి ఉన్నది, పక్కా రిజిస్ట్రేషన్. సెల్: 9381449563.
AJG-210731

రియల్ ఎస్టేట్
వేగంగా అభివృద్ధి చెందుచున్న ఆంధ్రప్రదేశ్‌లో మల్లవల్లి ఇండస్ట్రియల్ హబ్ (హనుమాన్ జంక్షన్ దగ్గర) సమీపంలో ఇన్‌స్టాల్‌మెంటులో ప్లాట్లు కలవు సంప్రదించండి: 94 94 44 12 19
AJB- 235063

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో విచారణలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా చెల్లించబడిన /క్లెయిమ్స్‌కు, దర్శ వ్యతిరేక మోసాలకు ప్రకటనదారులతో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

Govt. Of. Andhra Pradesh ENDOWMENTS DEPARMENT
Sri Mavullamma Ammavari Devashanam
Bhimavaram Town, West Godavari Dt.
E-PROCURMENT TENDER
NIT NORC.NO.A1/81/2024 dt.20-03-2025
e-Procurment Tenders are invited through the e-Procurment portal for **Painting to Sri Mavullamma Ammavari Temple up to Roof Level.** Interested bidders may visit the officalwebsite **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines.
Sd//B.L.Nagesh
Asst.Commissoner & Executive Officer

'మేడేను ఘనంగా నిర్వహించాలి'

బుట్టాయగూడెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి పిలుపునిచ్చారు. శుక్రవారం బుట్టాయగూడెం ప్రజా సంఘాల కార్యాలయంలో మే డే పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా కార్మికులంతా మే డేను ఘనంగా నిర్వహించాలన్నారు. వెంకటలక్ష్మి, చంద్రమ్మ, ముక్కమ్మ, మంగతాయారు. అనూష తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వార్షిక శిక్షణ క్యాంపు ప్రారంభం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్‌సీసీ కేడెట్లకు పది రోజుల తొలివిడత వార్షిక క్యాంపు స్థానిక సెయింట్ డీపాల్ కాలేజీలో శుక్రవారం ప్రారంభమైంది. క్యాంపు ఆర్మీ సైనిక శిక్షణలో భాగంగా ఫైరింగ్, ఫీల్డ్‌క్రాఫ్ట్ ఫైర్ డెమో తదితర అంశాల్లో మొత్తం 600మంది కేడెట్లకు శిక్షణ ఇస్తామని 19 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ అమిత్ పాండే తెలిపారు. ఎన్‌సీసీ ఏలూరు జిల్లా సీవో కార్యాలయ పలు విభాగాల అధికారులు, ఏఎన్‌వోలు పాల్గొన్నారు.

టీచర్లకు ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయాలి


సీఎం చంద్రబాబును కలిసిన డీపీఆర్టీయూ జిల్లా నాయకులు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు ప్రయోజనం చేకూర్చేలా ఉమ్మడి సర్వీసు రూల్స్‌ను ఏర్పాటుచేసి అమలు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును అభ్యర్థించారు. సీఎంను అమరావతిలో గురువారం రాత్రి కలిసి చర్చించిన విషయాలను డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీను, పి.వెంకటేశ్వరరావు, పీఆర్టీయూ మాతృసంఘ తెలంగాణ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ బి.మోహన్‌రెడ్డి శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు టీచర్ల ఉమ్మడి సర్వీసులకోసం జీవోలు 505,538లను విడుదలచేసి వేలాదిమందికి పదోన్నతులు కల్పించిన విషయాన్ని గుర్తుచేసి, ఇపుడు నవ్యాంధ్రప్రదేశ్‌లోనూ అవే ప్రయోజనాలను ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లు పొందేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లోవున్న డీఏల చెల్లింపునకు, నూతన పీఆర్సీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. తమ అభ్యర్థనలపై సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : సొంగా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

చింతలపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) :రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏఎంసీ ఆవరణలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందించే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు గంటలోనే ధాన్యం సొమ్ము జమ చేసిన సందర్భాలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ.50 లక్షల విలువైన వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను 232 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందిస్తున్నట్టు తెలిపారు. ఖరీఫ్ సీజన్ కోసం 3,152 క్వింటాళ్ళ పచ్చిరొట్ట విత్తనాలను ఖరీఫ్ సిద్ధంగా ఉంచామన్నారు. నాయకులు జె.ముత్తారెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ నాగకుమార్, మాటూరి వెంకట్రామయ్య, మధుబాబు, నాలుగు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు టీడీపీ : చింతమనేని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ, అంకితభావానికి మారుపేరు తెలుగుదేశం పార్టీ అని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమంకోసం చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ పార్టీ ఆదేశాలను అనుసరించి కుటుంబ సాధికార సారథుల(కేఎస్ఎస్) నియామక ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. కేఎస్ఎస్‌ల నియామక ప్రక్రియతోపాటు యూనిట్ ఇన్‌చార్జిలు, బూత్ ఇన్‌చార్జ్‌ల నియామక ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులకు సూచించారు. పార్టీ నాయకులు యూఎస్.రామ్‌ప్రసాద్, బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, ప్రభాకర్, గారపాటి రామసీత, మోరు శ్రావణి, కమ్మ శివరామకృష్ణ, కొనకళ్ల శివమణి, లావేటి శ్రీనివాసరావు, బొడ్డేటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'పది' రెమిడియల్ క్లాసులపై 'ఫ్యాప్టో' అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షల్లో ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధమవుతున్న బాలబాలికలకు ఆయా ఉన్నత పాఠశాలల్లో వచ్చేనెల 19వరకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెమిడియల్ తరగతులు నిర్వహించాలని విద్యాశాఖ అధికారుల మౌఖిక ఆదేశాలు జారీ చేయడంపై అన్ని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం 'ఫ్యాప్టో' జిల్లా చైర్మన్ మోహనరావు, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మాట్లాడుతూ ఒకవేళ రెమిడియల్ క్లాసులు నిర్వహించాల్సిన పరిస్థితులుంటే ఆ మేరకు లిఖితపూర్వక ఉత్తర్వులు జారీ చేసి, ఎర్న్ లీవులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాశరావు, రవికుమార్, పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు సాగు నమోదు చేయాలి

పోలవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పోలవరం ఏజెన్సీలో ముప్పై ఏళ్లుగా సాగు చేస్తున్న గిరిజనుల భూములకు సాగు నమోదు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కారం భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాగంపాలెం గ్రామంలో రీసర్వే గ్రామసభలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. 1/70 చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మడివి చలపతి, మిడియం పండుదొర, కాకి బాలరాజు, జయలక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూమి ఆక్రమణపై ఫిర్యాదు


డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న దళిత సేన నాయకులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి) :దళితులు సాగు చేసుకునే మెట్ట భూమిని ఆక్రమించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర రావుకు రవిప్రకాష్, ఏలూరు జిల్లా దళితసేన వర్కింగ్ ప్రెసిడెంట్ స్టాలిన్, చింతలపూడి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మోనూరు దేవమాత, దళిత మహిళా సాగుదారు పాము రాణి వినతి పత్రం అందజేశారు. చింతలపూడి మండలం బట్టువారిగూడెం గ్రామం విష్ణు సాగర్ రోడ్డులో గల దానారు పాము రాణి సాగు చేసుకునే మెట్ట భూమి 2.55 ఎకరాల భూమిని అగ్రవర్ణానికి చెందిన వ్యక్తులు కొంతమంది దళారులు కూలీలుతో దౌర్జన్యంగా భూమిలోకి చొరబడి ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు చేశారని తెలిపారు. డీఆర్‌వో స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

బీరుసీసాతో ఒకరిపై దాడి.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురానికి చెందిన తగరం కార్తీక్ బీరుసీసాతో అదే గ్రామం బాపూజీనగర్‌కు చెందిన దమ్మిశెట్టి రవి అనే వ్యక్తి తలపై కొట్టి దాడి చేసిన ఘటన జరిగిందని ఎస్ఐ ఎస్‌కే జబీర్ తెలిపారు. గ్రామానికి చెందిన దమ్మిశెల్లి రవి ట్రాక్టరు నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈనెల 24 రాత్రి గ్రామంలోని మద్యం దుకాణం వద్దకు వెళ్లి మద్యం తాగుతుండగా అదే గ్రామానికి చెందిన తగరం కార్తీక్ వేరేవారితో గొడవ పడుతున్నాడు. బాధితుడు దమ్మిశెల్లి రవి.. కార్తీక్‌ను మందలించడంతో అక్కడ నుంచి వెళ్లి అరగంట తరువాతో బీరు సీసాతో వచ్చి తలపై కొట్టడంతో రవి తల, చెవి, చేతులకు గాయాలయ్యాయి. అనంతరం బాధితుడు రవి బావ ప్రసాద్ వచ్చి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కార్తీక్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.


ఏలూరు నిరసన ర్యాలీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓబీసీ నాయకులు


బర్రింకలపాడులో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, నాయకులు


కామవరపుకోటలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ తదితరులు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

» ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు » జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శనలు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పహల్గాం దాడిలో ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఏలూరు పాతబస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి నివాళులర్పించి సంతాపం తెలిపారు. మానవ హారంగా ఏర్పడి జనసేన నాయకులు నిరసన చేపట్టారు. పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

● ఏలూరు పట్టణ ముస్లిం జేఏసీ, ఎస్సీ, ఓబీసీ నాయకులు ఉగ్రదాడిని నిరశిస్తూ పాతబస్టాండ్ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు మతం ఉండదని, 28మందిపైగా టూరిస్టులను తుపాకులతో కాల్చి చంపడం హేయమైన చర్య అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ దీనిని మతం రంగు పులుముతుందని వీరి ద్వేషపూరిత మాటల్లోకి దేశ ప్రజలు రాకుండా ఉండాలని కోరారు. ముస్లిం జేఏసీ కన్వీనర్ మహమ్మద్ ఇలియాస్, మొహమ్మద్ నయీముల్లా, రియాజ్ ఆలీఖాన్, షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్ ప్రొటెక్షన్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మెండెం సంతోష్‌కుమార్, దళిత ప్రజా సమితి అధ్యక్షులు కాపుదాసి రవికుమార్, మంచెళ్ళ ఇస్సాకు, నూకపెయి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

● ఉగ్రదాడిని నిరశిస్తూ శుక్రవారం ఏలూరు బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద ఏలూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కో-ఆర్డినేషన్ కమిటీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.శ్రీనివాస్‌మోహన్, కాళే శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాద చర్యలను నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఎంప్లాయిస్ కో-ఆర్డినేషన్ కమిటీ జిల్లా కోశాధికారి ఎస్.శ్రీనివాసరావు, తదితర బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేస్తూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు, నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, బీవీఆర్.చౌదరి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, పట్టణ అధ్యక్షుడు సీహెచ్.అచ్యుత రామయ్య, షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట:కామవరపుకోటలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొత్తూరు చెక్ పోస్టు నుంచి కామవరపుకోట చౌతనా సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు షేక్ వలీ మాట్లాడుతూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నందూరి భాను, ఉన్నంగి శ్రీనివాసరావు, రెబ్బా పరాత్పరరావు, ఘంటా సురేష్ పాల్గొన్నారు.

●పోలవరం/జీలుగుమిల్లి/బుట్టాయగూడెం/కొయ్యలగూడెం : పోలవరం మండలం పోలవరంలో ఉగ్రదాడిని నిరశిస్తూ కూటమి నాయకులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఏటిగట్టు సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఉగ్రదాడిలో మృతులకు సంతాపం తెలిపారు. నాయకులు బొడ్డు కృష్ణ, మంగిన కొండ, జల్లేపల్లి వెంకటనరసింహారావు, కొణతాల ప్రసాద్, గునపర్తి చిన్ని తెలగంశెట్టి రాంప్రసాద్, కరిబండి నాగరాజు, బొరగం వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. గూటాల అల్ రెహ్మాన్ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. జీలుగుమిల్లిలో బీజేపీ నాయకులు కెవిఎల్.ప్రసాద్, ఆధ్వర్యంలో, రామన్నపాలెంలో దాసు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిరసనలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు చేశారు. బుట్టాయగూడెం మండలం బుట్టాయగూడెంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. షేక్ హిమామ్, ఎస్ఏఏ బాజీ, మటన్ గౌస్, టైలర్ బాజీ, అమీర్, కోతమిషన్ బాషా తదితరులు పాల్గొన్నారు. కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌లో డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు ఆధ్వర్యంలో కూటమి నా యకులు మానవహారం, నిరసన తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, బీజేపీ మండల అధ్యక్షుడు గొలిశెట్టి వాసు, చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఎస్ఆర్ఆర్. నరసింహరాజు, మాదేపల్లి శ్రీను, బాబి, తదితరులు పాల్గొన్నారు.


కుక్కునూరులో నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో..

కుక్కునూరు/వేలేరుపాడు :కుక్కునూరు ప్రధాన సెంటర్‌లో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ప్రధాన సెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎం.యుగంధర్, మంత్రి గోపాలకృష్ణ, ఎం.వెంకన్నబాబు, రాఘవ, వెంకటేశ్వర్లు, వినోద్, మధూ, రవిప్రసాద్, కోటి, రవి పాల్గొన్నారు. వేలేరుపాడు మండలం వేలేరుపాడు అంబేడ్కర్ సెంటర్‌లో ఎన్డీఏ నాయకులు మానవహారం, ర్యాలీ నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు గణేశుల ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శాఖమూరి సంజీవులు మాట్లాడారు. కూటమి నాయకులు, పాల్గొన్నారు.

గిరిజన యువతకు ట్రైకార్ చేయూత

బుట్టాయగూడెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ట్రైకార్ సంస్థ ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ట్రైకార్ ఎం.డి. మణికుమార్ తెలిపారు. శుక్రవారం బుట్టాయగూడెం క్యాంపు కార్యాలయం వద్ద హైపర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హైపర్, ట్రైకార్ ఆధ్వర్యంలో పెరటి కోళ్ల పెంపకం పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్రం నిదులు రూ.8 కోట్లతో పథకాన్ని అమలు చేస్తామన్నారు. పథకం అమలుకు రాష్ట్రంలో 25 మండలాలను ఎంపిక చేయగా ఏలూరు జిల్లాలో బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం మండలాలను పైలట్ ప్రాజెక్టు మండలాలుగా ఎంపిక చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి రూ.110 కోట్లు మంజూరు చేసిందన్నారు. ట్రైకార్ చైర్మన్ అనుమతితో త్వరలోనే యూనిట్ల స్థాపనకు చర్యలు తీసుకుంటామన్నారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, హైపర్ సంస్థ వీడీ శ్యామ్‌కుమార్, సునీత, వెటర్నరీ ఏడీ సాయి బుచ్చారావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి

టి.నరసాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):అల్లూరి సీతారామరాజ్‌నగర్ కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ గత 17 ఏళ్లుగా కాలనీలో మౌలిక సదుపాయాలు లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా విద్యుత్ సౌకర్యంతో పాటు రోడ్డు నిర్మాణాలను ప్రభుత్వం కలిపించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో గిరిజనులు మడకం కుమారి, బరగడ కుమారి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

కొయ్యలగూడెం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):ఎస్సీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి తెలిపారు. స్థానిక ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య సముదాయాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. భవన పరిస్థితులను పరిశీలించి, భవనాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలో కొయ్యలగూడెం, బుట్టాయిగూడెం, నల్లజర్ల, దూబచర్లలో వాణిజ్య సముదాయాలున్నాయని వీటిని పరిశీలించానని, వీటి అభివృద్ధికి ప్రత్యేకనిధులు కేటాయిస్తామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డీటీ వెంకటలక్ష్మి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



చింతలపూడి, బుట్టాయగూడెంల్లో ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అవగాహన ర్యాలీలు

మలేరియా నివారణకు కృషి చేద్దాం

» వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మావనహారం, అవగాహన ర్యాలీలు

జిల్లావ్యాప్తంగా అధికారులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినం పురస్కరించుకుని శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పలు చోట్ల మానవహారం నిర్వహించి, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

బుట్టాయగూడెం/టి.నరసాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వైద్యాధికారుల సూచనలతో ముందస్తు చర్యలతో మలేరియాను నివారించ వచ్చని కేఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్ సూచించారు. బుట్టాయగూడెం నెహ్రూ బొమ్మ సెంటరులో మావన హారం ఏర్పాటు చేసి మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త లను వివరించారు. జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేష్‌కుమార్, వైద్యాధికారులు డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ మోహిత్, ఎస్‌యూవో పి.పెద్దిరాజు, ఎంపీహెచ్‌ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు. టి.నరసాపురం మండలం బొర్రంపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఏఎం.ఆంజనేయులు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్‌ఈవో ఏడుకొండలు, సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● దెందులూరు:మలేరియా వ్యాధి నిర్మూలన ప్రజలందరి సామాజిక బాధ్యతగా భావించాలని అప్పుడే మలేరియా రహిత సమాజాన్ని స్థాపించుకోవచ్చాని దెందులూరు మండలం చల్లచింతలపూడిలో ఆయుష్మాన్ గ్రామీణ ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్ డాక్టర్ నంబూరి త్రివేణి ఆధ్వర్యంలో, హెల్త్ అసిస్టెంట్ కంతేటి సత్యనారాయణ, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అవగహన ర్యాలీని తిమ్మనగూడెం, యాదవులపేట, గౌడ వీధి. పాతూరు, కొత్తూరు ప్రాంతాల్లో అవగాహన కల్పించారు.

●చింతలపూడి/లింగపాలెం:'మలేరియా అంతం మనతోనే' అనే నినాదంతో చింతలపూడి సబ్‌యూనిట్ పరిధిలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూనిట్ ఆఫీస్ నుంచి పాతబస్టాండ్ వరకు ర్యాలీ జరిగింది. బోసుబొమ్మ సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి మలేరియా నిర్మూలనపై డాక్టర్ ప్రసాద్ ప్రజలకు అవగా హన కల్పించారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ నరేంద్ర, మలేరియా యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

భయంతో వృద్ధురాలి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారనే భయంతో ఒక వృద్ధురాలు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు రూరల్ మండలం సుంకరవారితోట ఇందిరమ్మ కాలనీకి చెందిన లంకా వెంకటరమణ(69), భర్త శంకర్ ఇద్దరూ నివాసం ఉంటున్నారు. వారు పెంచుకుంటున్న కుక్క రోడ్డు వెంబడి వెళ్లేవారిపై అరుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తుంది. శుక్రవారం ఉదయం ఇద్దరు పిల్లల భయభ్రాంతులకు గురై వారి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు వచ్చి కుక్కను లోపల పెట్టుకోవాలని మందలించారు. ఆగ్రహించిన ఆ వృద్ధురాలు బ్లేడు తీసుకుని వారి ఇళ్లకు వెళ్లి చెయ్యి కోసుకుని గుమ్మం నిండా రక్తం చేసేసింది. ఈ క్రమంలో వారు భయపడి పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వెళ్లారు. తనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని, ఆమె భయపడి తన ఇంటికి వెళ్లి ఉరి వేసుకుంది. భర్త గమనించి స్థానికుల సాయంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నెల రోజుల్లో వివాహం.. బైక్‌తో గోడను ఢీకొని యువకుడి మృతి


సాయికుమార్ (ఫైల్)

ఏలూరు క్రైం :నెలరోజుల్లో ఆ యువకుడికి వివాహం కాబోతోంది. అటు అత్తింటి వారు ఇటు పుట్టింటి వారు పెళ్లిపనులతో హడావుడిలో ఉన్నారు. ఆ యువకుడు మోటారు సైకిల్‌తో అతివేగంగా వెళ్తుండగా ఇంటి సమీపంలోనే అదుపు తప్పి గోడను ఢీకొని ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనతో ఆ రెండు కుటుంబాలతో పాటు ఆప్రాంత వాసుల్లో తీరని విషాదం నెలకొంది. ఏలూరు తంగెళ్ళమూడి రాణీనగర్‌కు చెందిన సీరా సాయికుమార్(30) షామియానా షాపును నిర్వహిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం ఒక యువతితో నిశ్చితార్థం జరిగింది. వచ్చేనెలలో వివాహం జరగనుంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వస్తుండగా ఇంటి సమీపంలోనే బైక్ అదుపుతప్పి ప్రహరీని ఢీకొంది. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని రాయితో దాడి.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఒక వ్యక్తిని తలపై కొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేశారు. ఏలూరులోని పాండురంగపురానికి చెందిన మహేశ్ అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున వన్‌టౌన్ మార్కెట్ రోడ్డులో వెళ్తుండగా ఏలూరులోని మారుతీనగర్‌కు చెందిన కల్లేపల్లి సతీశ్ అనే వ్యక్తి అడ్డగించి మద్యానికి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. దీనికి మహేశ్ నిరాకరించడంతో పక్కనే ఉన్న రాయితీసుకుని దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. గాయాలపాలైన అతడిని ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో కేసు నమోదు చేశారు. సతీశ్‌ను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారు.


కోడిగూడెంలో కుళాయి నుంచి వస్తున్న బురదనీరు

ఈనీరు తాగేదెలా ?

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్న అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. స్వచ్ఛమైన తాగునీరు అందించకపోగా అవి కొన్నిచోట్ల వాడుకకు పనికి రావడం లేదు. ద్వారకాతిరుమల మండలం కోడిగూడెం పంచాయతీ పరిధిలో గత కొన్నాళ్లుగా కుళాయిల ద్వారా కలుషితమైన నీరు వాసనతో వస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మంచినీటిని ప్రజలకు అందించాలని పలువురు కోరుతున్నారు.

మూడు మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ

జంగారెడ్డిగూడెం,ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఏలూరు, ఏలూరు రూరల్ పరిధిలోని మూడు మద్యం దుకాణాలకు స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో ఈనెల 24 నుంచి మే మూడో తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు దరఖాస్తు రుసుం రూ.2లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.


శిశుగృహాన్ని పరిశీలిస్తున్న డీఎల్ఎస్‌కే కార్యదర్శి రత్నప్రసాద్

శిశువులు ఆరోగ్యంగా ఉండాలి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శిశువులకు పౌష్టికాహారాన్ని అందించి వారు ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. ఏలూరు విద్యానగర్‌లో ఉన్న ప్రభుత్వ శిశు గృహాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ శిశువులకు అందుతున్న సదుపాయాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల సంరక్షణలో ఎదురయ్యే సమస్య లను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న చంద్రశేఖరరావు

'టెన్త్'లో సూర్య విద్యార్థుల ప్రతిభ

ఏలూరురూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 591 మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖరరావు తెలిపారు. శుక్రవారం విజేతలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 591 మార్కులతో పాఠశాల ఫస్ట్ వచ్చిన విద్యార్థులు కొమ్మన నాగచరణ్‌తేజ, చిట్టూరి కార్తికేయలను అభినందించారు. 580 మార్కులతో సీహెచ్ సాయిఅమృత లక్ష్మీ ద్వితీయ స్థానం, 579 మార్కులతో ఆర్.లక్ష్మీయశస్విని తృతీయ స్థానంలో నిలిచారన్నారు.

డీఎల్ఎడ్ సెమిస్టర్ పరీక్షలు

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డీఎల్ఎడ్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. మూడో సెమిస్టర్ పరీక్షలకు 45 మంది, ఒకటో సెమిస్టర్ పరీక్షలకు 90మంది హాజరయ్యారని డీఈవో తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కుక్కునూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కుక్కునూరులో చర్చి స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం జరిగింది. 1992 నుంచి 2010 వరకు చర్చి స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులంతా కలిశారు. అప్పటి జ్ఞాపకాలు నెమరవేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

హెచ్‌ఐవీ చిన్నారులకు కిట్ల పంపిణీ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):హెచ్‌ఐవీ రోగులకు పింఛన్ అందేలా ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువెళ్తానని టీడీపీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో హెచ్‌ఐవీ రోగులకు కంచర్ల గణేష్ ఆర్థిక సహకారంతో పౌష్టికాహార కిట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ రాంబాబు,టీడీపీ నాయకులు అల్లూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను విజయవాడ, బందరుకు తరలింపు

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సును బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఢీకొని తీవ్ర గాయాలకు గురైన సంఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ముదినేపల్లికి చెందిన కంచర్ల రాజశేఖర్, వినుకొండ సునీల్ కుమార్‌లు గాయపడగా గుడివాడ ఆసుపత్రికి తరలించిన విషయం తెలిసిందే. మెరుగైన చికిత్స కోసం రాజశేఖర్‌ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి, సునీల్ కుమార్‌ను బందర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆకేసు నమోదు చేసి ఎస్‌ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి చెరువులు నింపుకోవాలి

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శివారు గ్రామాల్లోని మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకోవాలని జలవనరుల శాఖ కృష్ణా డివిజన్ ఈఈ ఆంజనేయ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కైకలూరు పంటకాలవను, కైకలూరు, పల్లెవాడ గ్రామాల మంచినీటి చెరువులను డీసీ చైర్మన్ పొత్తూరి వాసురాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల చివరివరకు నీరు విడుదల అవుతుందని, చెరువులను యుద్ధప్రాతిపాదికన నింపుకోవాలన్నారు.

ఫోర్జరీ లీజు డాక్యుమెంట్లతో రుణాలు



చేవూరులో రైతులను విచారిస్తున్న సీబీఐ అధికారులు

- ముదినేపల్లి మండలంలో సీబీఐ అధికారుల విచారణ
- తమకు తెలియదంటున్న రైతులు
- మరణించిన వారి పేరుపైనా రుణాలు
- జాతీయ బ్యాంక్‌కు తాడేపల్లిగూడెంవాసి టోకరా

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ముదినేపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతుల పేరున చేపల చెరువుల లీజు పేరిట తప్పుడు అగ్రిమెంట్లు సృష్టించి ఓ వ్యక్తి బ్యాంకు నుంచి కోట్లాది రూపాయల రుణాలను తీసుకున్న ఉదంతం వెలుగు చూసింది. వరి సాగులో ఉన్న భూములను సైతం చేపల చెరువులుగా చూపించి రుణాలు తీసుకోవడం గమనార్హం. 2015లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 188 రైతుల నుంచి తాను చేపల చెరువుల తవ్వకానికి భూములను లీజుకు తీసుకున్నట్టు రైతుల సంతకాలను ఫోర్జరీ చేసి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకు చెందిన ఎస్.కిరణ్ అనే వ్యక్తి భీమవరంలోని ఒక జాతీయ బ్యాంక్ నుంచి కోట్లాది రూపాయల రుణాలు తీసుకుని తిరిగి చెల్లించలేదు. బ్యాంక్ అధికారులు ఆరా తీయగా రుణాలు తీసుకోవడంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని తెలిసింది. దీనిపై ఆ బ్యాంక్ ఉన్నతాధికారులు విశాఖపట్నం సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేయడంతో 2024 అక్టోబరులోనే సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ విషయాలేవీ స్థానిక రైతులకు సీబీఐ అధికారులు విచారణకు వచ్చేవరకు తెలియకపోవడం గమనార్హం. ఈ కేసు విచారణలో భాగంగా గత రెండు రోజులుగా సీబీఐ అధికారులు ముదినేపల్లి మండలంలో బ్యాంకు డాక్యుమెంట్లపై సంతకాలున్న రైతులను విచారించారు. గురువారం గురజ, దేవరం, సింగరాయపాలెం, అల్లూరు, శుక్రవారం చేవూరు పరిధిలో విచారణ నిర్వహించారు. గురజలో చేపట్టిన విచారణలో 2020లో చేపలు చెరువులు తవ్వగా 2015లోనే చెరువులపై రుణాలు తీసుకున్నట్టుగా బయట పడింది. మీ భూమి పోర్టల్‌లో నమోదైన పలువురు భూ యజమానుల పేరున రుణాలు తీసుకున్నట్టు అధికారులు చెప్పగా, వారు సుమారు 30 ఏళ్ల క్రితమే మరణించారని రైతులు తెలిపారు. కొంతమంది విద్యావంతులు సంతకాలకు బదులు వేలిముద్రలు వేసినట్టు, కొంతమంది నిశానిదారులు బాండ్లపై సంతకాలు చేసినట్టు గుర్తించారు. సింగరాయపాలెం ఏరియాలోని చేపల చెరువుల రైతులు కె.నాగబాబు, పి.నరసింహారావు, సీహెచ్.సుబ్రహ్మణ్యం తదితరులు తమ పేరున భీమవరం బ్యాంక్‌లో రుణాలు తీసుకున్నట్టు తెలిసి అవాక్కయ్యారు. చేవూరులో శుక్రవారం సీబీఐ అధికారులు రైతులను విచారించగా, తాము రుణాలు తీసుకోలేదని, తమ సంతకాలు ఫోర్జరీ చేశారని వల్లభనేని వెంకట్రావుతో పాటు పలువురు రైతులు అధికారులకు తెలిపారు. భూముల సర్వే నంబర్లను పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 188 మంది రైతులను విచారించి వివరాలు సేకరిస్తున్నామని, విచారణ నివేదికను ఉన్నతాధికా రులకు అందిస్తామని తెలిపారు.

సహకారం ఎవరిది ?

పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కిరణ్ అనే వ్యక్తి ముదినేపల్లి మండలంలోని రైతుల పేరున లీజు అగ్రిమెంట్లు సృష్టించడం వెనుక ఎవరి సహకారం ఉందనేది చర్చ నీయాంశంగా మారింది. ముదినేపల్లి ప్రాంతంలో అంతకు ముందు చేపల చెరువులకు భూములు లీజుకు తీసుకున్న ఆ ప్రాంతానికి చెందిన లీజుదారులు ఎవరైనా సహకరించి ఉంటారని లేదా స్థానికులు ఎవరైనా సర్వే నంబర్లు చెప్పి ఉండవచ్చని భావిస్తున్నారు.

ఫేస్‌బుక్‌లో మంత్రిని దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు



ముసునూరులో పోలీసులకు ఫిర్యాదు ఇస్తున్న టీడీపీ నాయకులు

చాట్రాయి/ముసునూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లో మంత్రి పార్థసారథిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్‌ఐ రామకృష్ణకు ఫిర్యాదు అందజేశారు. వైసీపీ ప్రోద్బలంతో మంత్రి పార్థసారథిని దుర్భాషలాడుతూ కులాల మధ్య పార్టీల మధ్య చిచ్చు పెడుతున్న సదరు వ్యక్తిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్‌లు గార్లపాటి మారేష్, కోట జోషి, ఎమ్మార్పీఎస్ నాయకులు రవిరామ్, మోదుగు ముత్తయ్య, కొమ్ము సుజనరావు, కలపాల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ముసునూరులో నియోజకవర్గ తెలుగుయువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ముసునూరు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గద్దల మోహన్‌రావు, నక్కా యోహాను, బడిపాటి సాంబయ్య, లక్కపాము కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర పొందండి



చాట్రాయిలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న తహసీల్దార్, ఏవో

చాట్రాయి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రబీ ధాన్యాన్ని రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు అమ్మి మద్దతు ధర పొందాలని, దళారులకు తక్కు వ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని తహసీల్దార్ గీత, ఏవో శివశంకర్ విజ్ఞప్తి చేశారు. చాట్రాయి రైతుసేవా కేంద్రంలో శుక్రవారం అధికారులు మాట్లాడుతూ మండలంలో ఈ రబీ సీజన్‌లో 550 ఎకరాలలో రబీ వరి సాగు జరిగిందని, ఇందు కోసం బూరుగుగూడెం, మర్లపాలెం, కోటపాడులలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రేడ్-1 రకం ధాన్యం క్వింటాల్ రూ.2320, కామన్ రకం క్వింటాల్ రూ.2300కు కొనుగోలు చేస్తున్నామని, రైతుల కోసం 11 వేల గోనె సంచులు తెప్పించి ఆర్‌ఎస్‌కేలలో సిద్ధంగా ఉంచామని, ధాన్యం కాటా వేసిన 48 గంటల్లో సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తహసీల్దార్, ఏవో చెప్పారు.

కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు తక్షణమే డబ్బులు చెల్లించాలని సీపీఐ నూజివీడు నేత నిమ్మగడ్డ నరసింహ అన్నారు. శుక్రవారం నాడు నూజివీడు మండలం దిగవల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం పని ప్రదేశాలలో కూలీలతో సమావేశంలో నిమ్మగడ్డ నరసింహ మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు పాలకులు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పని ప్రదేశాలలో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి బీసీకాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పేరం సుబ్బారావు ఇల్లు దగ్ధమైంది. సుబ్బారావు తన భార్యతో కలిసి కూలీ పనులకు వెళ్ళాడు. ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇంటి నుంచి మంటలు రావడంతో చుట్టుపక్కలవారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఈ సంఘటనలో ఇంటిలో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయి, సుబ్బారావు కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాద సంఘటనను రెవెన్యూ, ట్రాన్స్‌కో అధికారులు పరిశీలించారు. సుమారు లక్ష రూపాయలు ఆస్తినష్టం వాటిల్లినట్లు నివేదికను తాయారు చేసి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రమణకు అందజేసినట్లు వీఆర్వో యశోద తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు కందుల పిచ్చియ్య తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రభుత్వ నుంచి వచ్చే సాహయాన్ని త్వరితగతిన వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి



శివయ్య (ఫైల్‌ఫోటో)

ముసునూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్ళిన వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన గోగులంపాడులో శక్రవారం చోటుచేసుకున్నది. చిమట శివయ్య(30) కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. స్థానిక రైతు పాలడుగు నాగేంద్రబాబుకు చెందిన పామాయిల్ తోటలో గెలలు కోసేందుకు కూలీకి వెళ్ళాడు. గెలలు కోసే క్రమంలో పామాయిల్ చెట్టు పైన ఉన్న 11కేవి విద్యుత్ లైన్‌కు ప్రమాదవశాత్తు కత్తి తగలడంతో అక్కడకక్కడే మృతి చెందాడు. ముసునూరు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శివయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్యా, కూమార్తె, కూమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

వార్లకోడు డ్రెయిన్ ఆక్రమణ

వర్షాకాలంలో పొంచి ఉన్న ముంపు



వార్లకోడు డ్రెయిన్‌ను ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేసిన దృశ్యం

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారు. కైకలూరులో వర్షాకాలం వస్తే ఎక్కడికక్కడే డ్రెయిన్లు పొంగి రహదా రులపైకి ఇళ్లల్లోకి ముంపు నీరు చేరుతున్నది. ఈ తంతు ప్రతి సంవత్సరం జరుగుతున్నప్పటికీ గతంలో డ్రెయిన్ ఆక్రమణలకు గురైనా పట్టించు కోని అధికారులు ప్రస్తుతం నిర్మాణాలు జరుగుతున్నా వాటిపై కన్నెత్తి కూడా చూడడం లేదు. గ్రామపంచాయతీ, డ్రెయినేజీశాఖ అధికారులు ఈ ఆక్రమణలు గురవుతున్న ప్రదేశాలను గుర్తించడం లేదు. కైకలూరు పట్టణంలోని సుమారు 75అడుగుల వెడల్పు గల అతిపెద్ద వార్లకోడు డ్రెయిన్ ద్వారా కైకలూరులో సగభాగం మురుగు నీరు ఈ డ్రెయిన్ ద్వారా కొల్లేరులోకి పారుదల అవుతున్నది. ఈ డ్రెయిన్‌ను ఎక్కడికక్కడే ఆక్రమ ణలకు గురిచేయడంతో వర్షాకాలంలో ఇళ్లు ము ంపు బారిన పడుతున్నాయి. అయినా కైకలూ రు బైపాస్‌రోడ్డు నుంచి వైఎస్సార్‌కాలనీకి వెళ్లే రహ దారిలో వార్లకోడు డ్రెయిన్‌ను గట్టును ఆక్రమిం చి ఓ వ్యక్తి తన స్థలానికి ప్రహరీగోడ నిర్మాణా న్ని చేపట్టారు. ఆ స్థల సమీపాన ఉన్న చేపల చెరువుగట్లు సైతం లోపలికి ఉన్నప్పటికీ వాటిని అధిగమించి డ్రెయిన్ల ప్రహరీగోడ నిర్మాణం చేశా రు. అతిపెద్ద మేజర్ డ్రెయిన్ అయినప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో కాం క్రీట్ కట్టడాలు జరిగిపోయాయి. రానున్న రోజుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే డ్రెయిన్ పూర్తిగా అన్యాక్రాంతం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.







నూజివీడు, కలిదిండి, ఆగిరిపల్లిలలో మలేరియాపై అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తున్న దృశ్యం

మలేరియాపై అవగాహన ర్యాలీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మలేరియాకు పూర్తి చికిత్స ఉన్నదని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎం.యలమంద అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా కోనేరుపేట యూపీహెచ్‌సీ పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంద మాట్లాడుతూ త్వరలోనే మలేరియా రహిత భారతదేశంగా మారనున్నట్లుగా ఆయన తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు టి కుమారి, రవీంద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కలిదిండి: కలిదిండిలో శుక్రవారం వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలిదిండి పిహెచ్‌సీ వైద్యాధికారిణి జాహ్నవి మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా వ్యాపిస్తుందన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకుని మస్కట్ కాయిల్స్, దోమ తెరలను వాడాలన్నారు. మలేరియా జ్వరం వచ్చిన వెంటనే పీహెచ్‌సీకి వస్తే వైద్యపరీక్షలు చేసి మందులు ఇస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి హేమంత్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని నూజివీడు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద సూచించారు. శనివారం మలేరియా దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి, ఈదర పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యలమంద మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిల్వలేకుండా చేయడం వల్ల దోమలు ప్రబలకుండా ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు నాగజ్యోత్స్న, ఎంపీహెచ్‌ఈవో రత్నబాబు పాల్గొన్నారు.

ఉగ్ర దాడిని నిరసిస్తూ హిందూ, ముస్లింల ప్రదర్శన



తీవ్రవాదుల దాడులను నిరసిస్తూ కొవ్వొత్తులతో కైకలూరులో నిరసన ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని యావత్ భారతదేశం ఖండిస్తున్నదని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు అన్నారు. శుక్రవారం రాత్రి కైకలూరులోని హిందూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక శ్యామలాంబ అమ్మవారి ఆలయం నుంచి ర్యాలీగా మాగంటి సెంటర్ వరకు జాతీయ రహదారి వెంబడి ఉగ్రవాదుల దాడులు నశించాలంటూ నినాదాలు చేశారు. తాలుకా సెంటర్లో మానవహారం చేసి నిరసన ప్రదర్శన చేశారు. పలువురు నల్లరిబ్బన్లు ధరించి ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. సీనియర్ న్యాయవాదులు గొర్తి ప్రభాకర దీక్షితులు, గురజాడ ఉదయశంకర్, మేడిశెట్టి పాములు, పిచ్చుకుల పవన్‌కాంత్ పాల్గొన్నారు.

ముస్లింల ఆధ్వర్యంలో...

ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ ముస్లింలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. పెద్దమసీదు సెంటర్ నుంచి జాతీయ రహదారి వెంబడి కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు.

ముదినేపల్లి: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా శుక్రవారం సాయంత్రం ముదినేపల్లిలో మసీదు కమిటీ సభ్యులు నల్ల బ్యాడ్జీలతో ప్రదర్శనను నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు ఎస్‌కె బాజీ, సభ్యులు షరీఫ్, నూరుల్లా, ఇమ్రాన్, రియాజ్, సులేమాన్ ఆధ్వర్యంలో ముస్లింలు నిరసన ప్రదర్శన నిర్వహించి దాడులను ఖండించారు.

టీడీపీ కార్యకర్తలకు సాయం



మరియమ్మ కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న మంత్రి సారథి

నూజివీడు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి):ఆపద సమయంలో పేదలకు మెరుగైన వైద్యం అందించటంలో సీఎం ఆర్‌ఎఫ్ అండగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు నియోజకవర్గం పోతురెడ్డిపల్లి, మొర్సపూడి గ్రామాల్లో తెలుగుదేశం కార్యకర్తలకు శుక్రవారం రాత్రి ఆర్థికసహాయం అందిస్తూ చెక్కులను అందచేశారు. నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామానికి చెందిన పంచగల వెంకటలక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్సకోసం మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకురాగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.4.5 లక్షలను ఎల్‌వోసీ మంజూరు పత్రాన్ని కుటుంబసభ్యులకు అందచేశారు. మొర్సపూడి గ్రామానికి చెందిన మరియమ్మ ప్రమాదంలో మూడునెలల క్రితం చనిపోవడంతో ఆమె కుటుంబాన్ని ఆదుకునే నిమిత్తం ప్రభుత్వం నుంచి రూ.5లక్షల చెక్కును శుక్రవారం ఆమె కుటుంబసభ్యులకు అందించారు.

మినుము కొనుగోలు కేంద్రాలపై అవగాహన



అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మినుము పంట క్వింటాకు రూ.7400 మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించిందని మండల వ్యవసాయాధికారి ఆర్ దివ్య తెలిపారు. శుక్రవారం కైకలూరు మండలం తామరకొల్లు రైతుసేవా కేంద్రంలో రైతులకు మినుము కొనుగోలు కేంద్రాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మినుము నాణ్యాత ప్రమాణాలను బట్టీ కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. మినుము అమ్మ దలచిన రైతులు వెంటనే దగ్గర్లోని రైతు సేవాకేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గుప్తా, సర్పంచ్‌లు భట్రాజు శివాజీ, నున్న రాంబాబు, తదితర అధికారులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడి గుడ్డు ధర	(100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475

ఆలయానికి వెండి ఆభరణాలు అందజేత

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం దేవపూడిలోని విజయ దుర్గాదేవి దేవస్థానంలో అమ్మవారికి, వినాయకుడికి ఇరువురు దాతలు వెండి ఆభరణాలను బహూకరించారు. విజయదుర్గాదేవికి సుమారు రూ.20 వేల విలువైన వెండి హారాన్ని ఆ గ్రామానికి చెందిన గుడివాడ హనుమంతరావు గుప్తా దంపతులు బహూకరించారు. చినకాబత్తిన వీర వెంకటేశ్వరరావు దంపతులు వినాయకుడికి వెండి నేత్రాలను బహూకరించారు. వీటిని శుక్రవారం విగ్రహాలకు అలంకరించి అర్చకులు చావలి సత్యసాయిబాబా పూజలు నిర్వహించారు. దేవస్థానం నిర్వాహకుడు దాసరి భగవాన్లు పాల్గొన్నారు.

రెండు వంతెనల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన



సభలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నూజివీడు, ఏప్రిల్ 25: గత 40 సంవత్సరాల నుంచి ఎదురు చూస్తున్న మూడు గ్రామాల కల నెరవేరింది. గురువారం రాత్రి యనమదల, రేగుంట, బోర్వంచ గ్రామాలకు అనుసంధానం చేస్తూ నూజివీడు, అటు ఆగిరిపల్లి గ్రామాలకు అతి తక్కువ సమయంలో వెళ్ళడానికి రెండు వంతెనలకు రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీరాజ్ ఆవిర్భావ దినోత్సవ సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి 1992 ఏర్పడిన పంచాయతీరాజ్ వ్యవస్థ గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం త్వరలో సుమారు 17వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు నియమించనున్నట్లు మంత్రి తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి : ఎమ్మెల్యే కామినేని



విలేకర్లకు పోస్టల్ ప్రమాద బీమా పాలసీ కార్డులను అందజేసిన ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో నియోజకవర్గంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు పోస్టల్ ప్రమాద బీమాను ఆయన సొంత ఖర్చులతో అందించారు. ఈ కార్యక్రమంలో 64 మంది విలేకర్లకు పోస్టల్ ప్రమాద బీమా కార్డులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విలేకర్లకు విద్య, వైద్యం, ఇళ్లస్థలాలు వంటివి కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె సురేష్‌కుమార్, గుడివాడ పోస్టల్ మేనేజర్ పి గణేష్, జి మోహన్‌వర్మ, స్టార్ హెల్త్ ఇన్సూరెన్సు ప్రతినిధి జి సతీష్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపకరణాల పంపిణీ



ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు ఆవరణలోని భవిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఐదు వీల్ చైర్స్, ఒక సీపీ చైర్, ట్రై సైకిల్, 8 హియరింగ్ ఎయిడ్స్‌ను ఎంఈవో కె.నరేష్ కుమార్, హైస్కూలు హెచ్‌ఎం విజయకుమార్ పిల్లలకు అందజేశారు.

వృద్ధ మహిళలకు చీరెల పంపిణీ

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పేరూరు మాజీ సర్పంచ్ సోమా రామలక్ష్మి, ఆమె భర్త మండల శ్రీ కృష్ణ యాదవ సేవా సంఘం అధ్యక్షులు సోమా సత్యనారాయణ దంపతులు గుడివాడలోని మమత వృద్ధాశ్రమంలో వృద్ధ మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. శుక్రవారం ఆ వృద్ధాశ్రమంలోని 50 మంది వృద్ధులకు చీరలు అందజేశారు. యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ యాదవ్, గుడివాడ మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సంఘ నాయకులు జాజుల తాతారావు యాదవ్, పెద్దిబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుల స్వీకరణ

కైకలూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసినట్టు టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు తెలిపారు. శుక్రవారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను రాష్ట్రపార్టీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు కొడాలి వినోద్, పీజెఎస్ మాల్యాద్రి, అంద్రాజు శ్రీనివాసరావు, తేరా రమేష్‌బాబు, కోకన్వీనర్ బొమ్మనబోయిన విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేసే కార్యకర్తలే టీడీపీకి బలం

ముదినేపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీకి అంకిత భావం కలిగిన కార్యకర్తలే బలమని కైకలూరు నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు దావు నాగరాజు అన్నారు. అల్లూరి గ్రామంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలకు సభ్యత్వనమోదు గుర్తింపు కార్డులను పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. అల్లూరి గ్రామ టీడీపీ తెలుగుయువత నాయకులు మీదిపల్లి సన్యాసిరావు, దాసరి శ్రీను, పంతగాని సురేష్, బొమ్మనబోయిన రత్నం తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదకర ప్రయాణం

చాట్రాయి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఫ్యామిలీ అంతా ద్విచక్రవాహనంపై ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది. ద్విచక్ర వాహనంపై ఐదుగురు వరకు, దీనికి తోడు లగేజీతో ఒకే బైక్‌పై ప్రయాణిస్తున్నారు. ఈ తరహా ప్రయాణాలు ఇటీవల ఎక్కువగా కన్పిస్తున్నాయి. బంధువుల ఇళ్ళకు, శుభ కార్యాలకు, ఇతర పనులకు ఇప్పుడు బైక్‌లనే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఎక్కడ వెయిటింగ్ లేకుండా తక్కువ సమయంలో గమ్య స్థానాలకు చేరుకోవటానికి పేద మధ్య తరగతి ప్రజలకు ఇప్పుడు ద్విచక్రవాహనమే ఏకైక రవాణా సాధనం అయ్యింది. ప్రమాదాలు జరిగాక హడావుడి చేయటం కంటే, ప్రమాదాలు జరగకుండా పోలీస్ రవాణా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234